మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 26-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 327 Issue: 327

26 మే 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:41 తిథి ఏకాదశి ఉ. 6:21వరకు సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం హస్త తె. 5:51వరకు యోగం సిద్ధి తె. 3:05వరకు కరణం వనిజ సా. 5:46 వరకు విష్టి ఉ. 6:21వరకు వర్జ్యం మ. 1:09 నుండి మ. 2:52 వరకు దుర్ముహూర్తం ఉ. 8:20 నుండి ఉ. 9:12 వరకు రా. 11:06 నుండి రా. 11:50 వరకు రాహుకాలం మ. 3:27 నుండి సా. 5:04 వరకు యమగండం ఉ. 8:59 నుండి ఉ. 10:36 వరకు గుళికాకాలం మ. 12:13 నుండి మ. 1:50 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు రా. 11:28 నుండి రా. 1:11 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:39 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## ఎండ ఎరుపు



### తెలంగాణకు రెడ్ అలర్ట్..

### 4 రోజులు ఇదే పరిస్థితి

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): తెలంగాణ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతూ ఉండగా.. తీవ్రమైన వడగాల్పులకు జనం అల్లాడిపోతున్నారు. మరో నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఎండల తీవ్రత కొనసాగుతుందన్న ఐఎండీ .. వడగాల్పులు అతి తీవ్రస్థాయిలో వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు తెలంగాణలోని తరువాయి 2 వ పేజీలో...



## పెట్రో కుదుపు

### మళ్లీ భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

**10 రోజుల్లో నాలుగోసారి పెంపు... హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ రూ. 115.69**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. భారత్‌లో ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఇన్ని రోజులు ఓపిక పట్టిన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇప్పుడు వరుసగా ఇంధన ధరల్ని పెంచుతూ పోతున్నాయి. సోమవారం మరోసారి పెట్రోల్, డీజిల్ ధరల్ని పెంచేశాయి. ఈసారి కూడా మళ్లీ ధరల పెంపు భారీగానే ఉంది.

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): లీటరు పెట్రోల్‌పై సగటున రూ. 2.61 చొప్పున పెరిగింది. డీజిల్‌పై చూస్తే రూ. 2.71 మేర పెరిగింది. తొలుత మే 15న పెట్రోల్, డీజిల్ ధరలు పెంచగా.. తర్వాత మే 19న ఒకసారి, 23న ఒకసారి పెంచాయి. ఇప్పుడు మే 25న మరోసారి పెంచగా.. మొత్తంగా 10 రోజుల వ్యవధిలోనే ధరలు ఏకంగా 4 సార్లు పెరగడం గమనార్హం. ఈ క్రమంలో తరువాయి 2 వ పేజీలో...



## ఈవీ నడుపు

### భారత ఈవీ మార్కెట్ రయ్ రయ్

### కార్ల విక్రయాల్లో అమెరికాను దాటేసిన భారత్



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల విప్లవంలో భారత్ మరో కీలక మైలురాయిని నమోదు చేసింది. దేశీయ ఆటోమొబైల్ రంగంలో వేగంగా పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా విడుదలైన వాహన్ రిజిస్ట్రేషన్ డేటా ప్రకారం, 2026 ఏప్రిల్ నెలలో దేశంలో అమ్ముడైన కొత్త కార్లలో ఎలక్ట్రిక్ కార్ల వాటా 5.8 శాతానికి తరువాయి 2 వ పేజీలో...



## 'పోక్సో' దోషికి రెండు మరణశిక్షలు

తమిళనాడులో పోక్సో కోర్టు కీలక తీర్పు

విద్యార్థినిపై అత్యాచారం, ఆపై దారుణ హత్య 3



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.3,00,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,075 |

## విశ్వవాణి



వోల్లేమి పైన్.. పై చిత్రంలో కనిపిస్తున్న చెట్టు పేరు ఇది. ఈ వృక్ష జాతి జురాసిక్ యుగం నాటిది. ఈ వృక్ష జాతి అంతరించిపోయిందని భావించారు, కానీ 1994లో ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్‌లో ఉన్న ఒక మారుమూల లోయలో దీనిని మళ్లీ కనుగొన్నారు. దాంతో ప్రపంచంలోనే అత్యంత అరుదైన, పురాతనమైన సజీవ వృక్షాలలో ఒకటిగా నిలిచింది.

# కోటి.. నా మాట!

### మహిళలను కోటీశ్వరులను చేస్తాం.. మహిళలకు చీర, సారె మా లక్ష్యం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి.. 8 వేల గ్రామైక్య సంఘ భవనాలు ప్రారంభం

రాష్ట్రంలోని 8 వేల స్వయం సహాయక బృందాల గ్రామ సంఘం భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య సొంత చెల్లెళ్లను అన్నలు ఇంట్లో నుంచి వెళ్లగొడుతున్నారని.. ఆస్తిలో వాటా అడుగుతారనే కారణంతో సొంత చెల్లిని కూడా ఇంట్లో నుంచే పంపిస్తున్న సందర్భంలో.. కోటి మంది ఆడబిడ్డలను ఈ మంత్రివర్గం సొంత సోదరీ మణుల్లా భావించి.. వారికి చీర పెట్టే కార్యక్రమాన్ని.. వారిని ఆర్థికంగా నిలబెట్టే ప్రణాళికను రూపొందించిందన్నారు.



హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): కోటి మంది ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతో తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. 2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే బాధ్యత తమ మంత్రివర్గం తీసుకుంటుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అవసరమైన ప్రణాళికలు రచించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని సీఎం తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. 29 నెలల్లో పది వేల కోట్ల రూపాయలకుపైగా మహిళలకు ఉచిత బస్సు కోసం ఆర్టీసీకి చెల్లించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలని గిట్టని వాళ్లు ప్రయత్నించారన్న రేవంత్ రెడ్డి.. ఆటో కార్మికులు, రిక్షా కార్మికులను రెచ్చగొట్టారన్నారు. అయినా సరే ప్రభుత్వం వెనక్కి తగ్గలేదన్నారు. చాలా మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో తరువాయి 2 వ పేజీలో...

## అట్టహాసంగా పద్మ అవార్డుల ప్రదానం

### రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా వేడుక.. దివంగత నటుడు ధర్మేంద్రకు పద్మ విభూషణ్

**వ్యాపారవేత్త ఉదయ్ కోటక్‌కు పద్మ భూషణ్.. క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్, నటుడు ప్రసేన్జిత్ చటర్జీకి పద్మ శ్రీ**





దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం 2026 సోమవారం నాడు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ ఏడాదికి గాను కేంద్ర ప్రభుత్వం మొత్తం 131 మందిని పద్మ పురస్కారాలకు ఎంపిక చేయగా, తొలి విడతలో భాగంగా 66 మందికి అవార్డులను ప్రదానం చేశారు.

న్యూఢిల్లీ: ఈ ఏడాది దేశ రెండవ అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్‌ను ఐదుగురికి ప్రకటించగా, తొలి విడత కార్యక్రమంలో భాగంగా ఇద్దరికి ప్రదానం చేశారు. బాలీవుడ్ దిగ్గజ నటుడు, 'హీ-మ్యాన్'గా పేరుగాంచిన స్వర్గీయ ధర్మేంద్రకు మరణానంతరం ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఆయన భార్య, ప్రముఖ నటి హేమమాలిని రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ఈ సమయంలో ఆమె తరువాయి 2 వ పేజీలో...

## భార్యాభర్తలకు ఎల్ఐసీ జాయింట్ లైఫ్ ప్లాన్

దేశీయ అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ భార్యాభర్తల కోసం ప్రత్యేకంగా రూపొందించిన రెండు కొత్త జాయింట్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవింగ్స్ ప్లాన్‌లను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 'ఎల్ఐసీ న్యూ జీవన్ సాథీ సింగిల్ ప్రీమియం', 'ఎల్ఐసీ న్యూ జీవన్ సాథీ లిమిటెడ్ ప్రీమియం' పేర్లతో ప్రవేశపెట్టిన ఈ ప్లాన్‌లు, ఒకే పాలసీ కింద జీవిత భద్రతతో పాటు దీర్ఘకాలిక పొదుపు ప్రయోజనాలను అందించనున్నాయి.

న్యూఢిల్లీ: భార్యాభర్తల ఆర్థిక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ ఉత్పత్తులను రూపొందించినట్లు ఎల్ఐసీ తెలిపింది. ఈ రెండు ప్లాన్‌లు నాన్-పార్, నాన్-లింక్డ్ సేవింగ్స్ ఉత్పత్తులుగా ఉండి, గ్యారెంటీడ్ అడిషన్స్, స్థిరమైన ప్రయోజనాలతో వస్తాయి. సింగిల్ ప్రీమియం ప్లాన్‌లో ఒకేసారి ప్రీమియం చెల్లించే అవకాశం ఉండగా, లిమిటెడ్ ప్రీమియం తరువాయి 2 వ పేజీలో...



## ఎల్పీజీ లేని సిలిండర్ వచ్చేస్తోంది!

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ.. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కంటే వంటను చౌకగా చేయగల, కొత్త ఇథనాల్ ఆధారిత స్టవ్ టెక్నాలజీని ఆవిష్కరించారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ.. ఇథనాల్ ఆధారిత కొత్త స్టవ్ ద్వారా, వంట గ్యాస్ సిలిండర్ల కంటే తక్కువ ఖర్చుతోనే వంట చేయవచ్చని తెలిపారు. ఇది దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతికతగా పేర్కొన్నారు.

నాగ్‌పూర్: ఇథనాల్‌ను నీటితో కలిపి మంటను ఉత్పత్తి చేయడం ద్వారా ఈ స్టవ్ పనిచేస్తుంది. ఇది సంప్రదాయ ఎల్‌పీజీ వంటి ఇంధనాల కంటే తక్కువ కాలుష్యాన్ని కలిగిస్తుంది. కాబట్టి గృహ వినియోగానికి ఇది ఒక ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంది. భారతదేశం చమురు అవసరాల కోసం.. సుమారు 87 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. ఈ పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో...

## ఇంధనం పొదుపు చేద్దాం

### కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్

అమెరికా-ఇరాన్ యుద్ధం.. ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తూ, దేశంలో ఖర్చులను పెంచుతున్నాయి. ఈ తరుణంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మూడు ఎఫ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. మూడు ఎఫ్‌లు - ఫ్యూయల్ (ఇంధనం), ఫర్టిలైజర్ (ఎరువులు), ఫారెక్స్ (విదేశీ మారక నిల్వలు).

ముంబై: ముంబైలో జరిగిన స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 37వ వార్షికోత్సవ కార్యక్రమంలో సీతారామన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎరువుల ధరలు ఊహకందని స్థాయికి చేరుకున్నాయి. కాగా ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా పెరుగుతుండటంతో ప్రజలపై భారం మరింత పెరుగుతోంది. కేవలం 11 రోజుల్లోనే పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 7.38 వరకు పెరిగిందని ఆమె పేర్కొన్నారు. కొంతకాలం పాటు అవసరం లేని దిగుమతులను తగ్గించడం, విదేశీ ప్రయాణాలను వాయిదా వేయడం, తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

26-5-2026

మేషం: బంధువులు ఒక ముఖ్యమైన వ్యవహారంలో మీ మాటతో విబేదిస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. రాబడికి మించిన ఖర్చులు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

వృషభం: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. బంధు మిత్రులతో ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. నూతన ఋణయత్నాలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి.

మిధునం: ప్రముఖుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. ఆర్థికంగా ఇబ్బంది ఉన్న అవసరానికి ధన సహాయం లభిస్తుంది.

కర్కాటకం: ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. దైవ చింతన పెరుగుతుంది. దాయాదులతో భూ వివాదాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మాట పట్టింపులు ఉంటాయి.

సింహం: ప్రముఖుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. విద్యార్థుల శ్రమ ఫలిస్తుంది. నిరుద్యోగుల కలలు నిజమవుతాయి.

కన్య: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఉంటాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో మనస్పర్థలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో విభేదిస్తారు. వృత్తి, వ్యాపారాలలో సమస్యలు తప్పవు.

తుల: సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. నూతన వస్తు లాభాలు పొందుతారు.

వృశ్చికం: నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక వివాదాలకు సంబంధించి ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో దీర్ఘకాలిక సమస్యల నుంచి గట్టెక్కుతారు. వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. బంధువులతో ఒక విషయంలో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో కొంత జాప్యం తప్పదు. ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

మకరం: ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితి ఉంటుంది. అవసరం లేని వస్తువులపై ధన వ్యయం చేస్తారు. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉద్యోగమున శ్రమాధిక్యత పెరుగుతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది.

కుంభం: ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు ఆశించిన స్థాన చలనాలు కలుగుతాయి.

మీనం: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. ప్రముఖుల సహాయంతో కొన్ని సమస్యలు పరిష్కరించుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఒత్తిడులు అధిగమిస్తారు. కీలక వ్యవహారాలలో సన్నిహితుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు.

# తమిళనాడులో 50 వేల వరకు రుణమాఫీ



రైతుల రుణమాఫీపై తమిళనాడు ముఖ్యమంత్రి డాక్టర్ చంద్రశేఖర్ జోసెఫ్ విజయ్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సహకార బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు భారీ ఊరట కల్పించేలా.. రుణమాఫీని ప్రకటించారు. సోమవారం సెక్రటేరియట్‌లో వ్యవసాయ, ఆర్థిక శాఖ మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం విజయ్ సుదీర్ఘంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

చెన్నై: విజయ్ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సామాన్య, మధ్యతరగతి రైతు కుటుంబాలకు ఉపశమనం కలుగుతుంది. తాజా ప్రకటన ప్రకారం.. గతేడాది మే 1, 2025- ఫిబ్రవరి 28, 2026 మధ్య కాలంలో కో-ఆపరేటివ్ బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకున్న వారందరికీ ఇది వర్తిస్తుంది. ఈ రుణమాఫీ పథకం వల్ల తమిళనాడు వ్యాప్తంగా దాదాపు 14.22 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరనుంది. దీంతో తమిళనాడు ప్రభుత్వ ఖజానాకు రూ. 2,044.46 కోట్లకుపైగా అదనపు భారం పడనుంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలే ముఖ్యమని సీఎం విజయ్ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు.





# పెట్రో కుదుపు

(మొదటి పేజీ తరువాయి)

గత 10 రోజుల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు సగటున రూ. 7.50 కుపైనే పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఇప్పుడు పెట్రోల్ ధర రూ. 2.61 చొప్పున పెరిగి లీటరుకు రూ. 102.12 కు చేరింది. ఇక డీజిల్ ధర రూ. 2.71 మేర పెరగ్గా ప్రస్తుతం లీటరు ధర రూ. 95.20 వద్ద ఉంది. ఇరాన్- అమెరికా యుద్ధం నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటం సహా ఇదే సమయంలో రూపాయి పతనం అవుతుండటం వల్ల ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలపై ఒత్తిడి పడుతోంది. చాలా రోజులు ఓపిక పట్టి ధరల్ని పెంచకుండా స్థిరంగా ఉంచినప్పటికీ.. ఇక తప్పని పరిస్థితుల్లో ధరల్ని పెంచుతున్నాయి.

**హైదరాబాద్ పెట్రోల్, డీజిల్ రేట్లు ఇలా..**

హైదరాబాద్ నగరంలో చూస్తే ప్రధాన మెట్రో నగరాల్లో దేశంలోనే ఇక్కడ పెట్రోల్, డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్నాయి. తాజాగా హైదరాబాద్ నగరంలో పెట్రోల్‌పై రూ. 2.84 పెరిగి లీటరుకు రూ. 115.69 వద్ద ఉంది. మే 15న రూ. 3.39 పెరగ్గా.. 19న రూ. 0.95, 23న రూ. 0.97 పెరగ్గా ఇప్పుడు రూ. 2.84 పెరిగింది. ఈ క్రమంలో పెట్రోల్ ధర 10 రోజుల్లో రూ. 107.50 నుంచి రూ. 115.69 కి చేరింది. డీజిల్ ధర హైదరాబాద్ సిటీలో తాజాగా రూ. 2.88 చొప్పున పెరగ్గా లీటరుకు రూ. 103.82 వద్ద ఉంది. మెట్రో నగరాల్లో హైదరాబాద్‌లో ఇంధన ధరలు ఎక్కువగా ఉండగా, ఓవరాల్‌గా ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయి. స్థానిక పన్ను రేట్లు అధికంగా ఉండటం ప్రధాన కారణం. విజయవాడలో పెట్రోల్ లీటరుకు రూ. 117.88 గా ఉండగా.. డీజిల్ ధర రూ. 105.54 వద్ద ఉంది.

# ‘పోక్సో’ దోషికి రెండు మరణశిక్షలు

**తమిళనాడులో పోక్సో కోర్టు కీలక తీర్పు**

**విద్యార్థినిపై అత్యాచారం, ఆపై దారుణ హత్య**

చెన్నై: తమిళనాడులో 12వ తరగతి విద్యార్థిని హత్యాచారం కేసులో దోషికి రెండు మరణశిక్షలను విధిస్తూ పోక్సో కోర్టు కీలక తీర్పును వెలువరించింది. విలాతికుళం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థినిపై ధర్మ మునీశ్వరన్ అనే వ్యక్తి అత్యాచారం చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా అతి దారుణంగా ప్రవర్తించినందుకు గానూ ఈ శిక్షలు విధిస్తున్నట్లు తెలిపింది. దీనిని అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు, గతంలోనూ పలు నేరాల్లో అతడికి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపింది. విలాతికుళం సమీపంలోని వేదనాథం గ్రామానికి చెందిన పన్నెండో తరగతి చదువుతున్న విద్యార్థిని మార్చి 10వ తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు వేదనాథం అటవీ ప్రాంతంలో తీవ్ర గాయాలతో విగతజీవిగా కనిపించింది. తాము ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి ఉన్నతాధికారులు స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మార్చి 19న నిందితుడిని అరెస్టు చేశారు. అతడు గతంలోనూ ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థినిపై హత్యాచారం జరిగిన సమయంలో అతడు బెయిల్‌పై బయట ఉన్నాడు



# విజయ్ ఆట మొదలు

## ముగ్గురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామా

## త్వరలో టీవీకే నుంచి పోటీ చేసే చాన్స్

కొత్త ప్రభుత్వం కొలువు దీరిన కొద్ది రోజులకే తమిళనాడులో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండు వారాల క్రితమే ఎమ్మెల్యేలు ప్రమాణం చేయగా.. వారిలో ముగ్గురు నేడు (సోమవారం) రాజీనామా చేశారు. పెరుందురై ఎమ్మెల్యే ఎస్.జయకుమార్, మధురాంతకం (ఎస్సీ రిజర్వ్‌డ్) ఎమ్మెల్యే మరగతం కుమారవేల్, ధరపురం (ఎస్సీ రిజర్వ్‌డ్) ఎమ్మెల్యే పి.సత్యభామ తమ పదవులకు రాజీనామా చేశారు.

చెన్నై: అన్నాడీఎంకేకు చెందిన ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు సోమవారం తమిళనాడు స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు తమ రాజీనామా లేఖలను సమర్పించగా.. స్పీకర్ వెంటనే ఆమోదం తెలిపారు. మే 13న అసెంబ్లీలో విజయ్ బలం నిరూపించుకున్న సమయంలో షణ్ముగం సారథ్యంలోని అన్నాడీఎంకే రెబల్ వర్గానికి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు టీవీకే ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేసిన సంగతి తెలిసిందే. వారిలో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. టీవీకే చీఫ్ కోఆర్డినేటర్, మంత్రి కేఏ సెంగొట్టాయన్ ఇచ్చిన మాట ప్రకారం ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. మీరు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే రానున్న ఉపఎన్నికల్లో మళ్లీ మిమ్మల్నే బరిలోకి దింపుతామని టీవీకే నుంచి వారికి హామీ వచ్చిందని సమాచారం. ధరపురం, పెరుందురై నియోజకవర్గాలు.. అన్నాడీఎంకేకు కంచుకోట లాంటి పశ్చిమ తమిళనాడులోని కొంగు ప్రాంతంలో ఉంటాయి. మధురాంతకం నియోజకవర్గం చెన్నై నగరానికి చేరువగా ఉంటుంది. తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాత ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు టీవీకే కీలక నేత, మంత్రి ఆధవ్ అర్జునను ఆయన చాంబర్‌లో కలిశారు.

# కోటి.. నా మాట!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణిస్తున్నారనే భావన కలుగుతున్న సమయంలో.. మహిళలను బస్సులకు యజమానులు చేయాలనే ఉద్దేశంతో వెయ్యి బస్సులను మహిళా సంఘాలు కొనుగోలు చేసి.. ఆర్టీసీకి ప్రతి నెలా రూ.70 వేల చొప్పున అద్దెకు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అందులో భాగంగా 553 బస్సులను అంకితం చేయబోతున్నామన్నారు. మండలానికి ఒక బస్సు చొప్పున.. పరేడ్ గ్రౌండ్‌లో అందరూ ఒకచోట చేరి జూన్ ఐదో తేదీ సాయంత్రం బస్సుల ప్రారంభోత్సవం జరపాలని మంత్రివర్గం ఆలోచన చేస్తోందన్నారు. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టును మహిళలకు ఇవ్వాలని భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రాల్లో మహిళలతో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయించామన్నారు. వీటి ద్వారా మహిళలు నెలకు రూ.4-5 లక్షలు సంపాదిస్తున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో వీలైనంత వరకు పెట్రోల్ బంకులకు స్థలాలు కేటాయించి.. ఆడబిడ్డలతో పెట్రోల్ బంకుల వ్యాపారం చేయించాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం రూ.5 లక్షలు ఉన్న బ్యాంకు లింకేజ్‌లను రూ.10 లక్షలకు పెంచుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.60,472 కోట్లను మహిళలకు బ్యాంక్ లింకేజీలు ఇచ్చిందన్నారు. నిర్మల్ జిల్లా మహిళా సంఘాలు అప్పులు చెల్లింపులో తొలి స్థానంలో ఉన్నాయని సీఎం కొనియాడారు. 8500 ఐకేపీ కేంద్రాల్లో మహిళలు ధాన్యం కొనుగోలు చేస్తే.. రవాణా, మిల్లర్లతో సమస్యలు వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో మహిళలే స్వయంగా రైస్ మిల్లులు కట్టుకునేలా రుణాలు ఇప్పిస్తామన్నారు. ధాన్యం నిల్వ చేయడానికి గోడౌన్లు కట్టుకోవడానికి స్థలాలు కూడా ఇస్తామన్నారు. లాజిస్టిక్ పార్కుల నిర్మాణానికి అవసరమైతే 100 ఎకరాల స్థలమైనా కేటాయిస్తామన్నారు. ప్రతి మండలంలో గోడౌన్ల నిర్మాణం, మిల్లుల ఏర్పాటుకు అనుగుణంగా 2-4 స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సీఎం సూచించారు. బ్యాంకులతో మాట్లాడి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడానికి సహకారం అందిస్తామన్నారు. మహిళా సంఘాలే సూపర్ మార్కెట్లు ఏర్పాట్లు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున కార్పస్ ఫండ్ ఇస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి మహిళ ఇందులో కొంత పెట్టుబడి పెట్టి రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి సూపర్ బజార్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం పట్టణాల్లో అవసరమైన భూములను నామమాత్ర ధరకు 30 ఏళ్లకు లీజ్‌కు ఇవ్వాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సీఎం సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన చీరెలను పంట పొలాల్లో పిట్టలను పారద్రోలడానికి వాడారని.. ఆడబిడ్డలకు తాము నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలోనే పట్టణాల్లోని ఆడబిడ్డలకు కూడా చీరలు పంచుతామన్నారు. గతంలో పాలపిట్ట రంగు చీర ఇస్తే ఇప్పుడు చిలక పచ్చ రంగు చీరలను ఇస్తున్నామన్నారు. చాలా మంది సొంత చెల్లెళ్లను ఇంట్లో నుంచి అన్నలు వెళ్లగొడుతున్నారు. ఈ మధ్యే రాజకీయాల్లో మీరు చూశారంటూ సీఎం రేవంత్ రెడ్డి తన ప్రత్యర్థులపై సెటైర్లు వేశారు.

# ఇంధనం పొదుపు చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

కొంతకాలం బంగారం కొనుగోళ్లను తగ్గించడం వంటి సూచనలు ప్రజలకు, పరిశ్రమలకు ప్రధాని ఇచ్చారని సీతారామన్ గుర్తుచేశారు. ప్రస్తుతం భారతదేశంలో ఇంధన ధరల పెరుగుదల మాత్రమే సమస్య కాదు. ఎరువుల ధరలు భారీగా పెరగడం వల్ల వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతోంది. మరోవైపు బంగారం ధరలు పెరగడం కూడా దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెంచుతోందని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. ఈ అంశాలన్నీ భారత ఆర్థిక వ్యవస్థకు సవాళ్లను సృష్టిస్తున్నాయని ఆమె వివరించారు.

# ఈవీ నడుపు

(మొదటి పేజీ తరువాయి)

చేరుకుంది. దీంతో తొలిసారిగా అమెరికాలో నమోదైన 5.1 శాతం ఈవీ వాటాను భారత్ అధిగమించింది. గత కొన్నేళ్లుగా భారత్‌లో ఈవీలకు డిమాండ్ స్థిరంగా పెరుగుతున్నప్పటికీ, ఈసారి నమోదైన వృద్ధి ఆటో రంగానికి కీలక సంకేతంగా భావిస్తున్నారు. 2025 ఏప్రిల్‌లో ఈవీ కార్ల మార్కెట్ వాటా 3.7 శాతంగా ఉండగా, 2026 మార్చిలో అది 5.1 శాతానికి చేరింది. కేవలం ఒక నెల వ్యవధిలోనే 5.8 శాతానికి పెరగడం దేశీయ మార్కెట్లో ఈవీలకు లభిస్తున్న ఆదరణను స్పష్టంగా చూపిస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, పర్యావరణ అవగాహన, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటం వంటి కారణాలతో వినియోగదారులు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా నగర ప్రాంతాల్లో రోజువారీ ప్రయాణాలకు ఈవీలు అనువైన ఎంపికగా మారుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు కూడా ఈవీ మార్కెట్ విస్తరణకు తోడ్పడుతున్నాయి. దేశీయ ఆటో కంపెనీలు కొత్త మోడళ్లను వరుసగా మార్కెట్లోకి తీసుకురావడం కూడా అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారింది. తక్కువ ధరల నుంచి ప్రీమియం సెగ్మెంట్ వరకు వివిధ ఎంపికలు అందుబాటులోకి రావడంతో మధ్యతరగతి వినియోగదారులు కూడా ఈవీల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు.

# అట్టహాసంగా పద్మ అవార్డుల ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

కుమార్తె అహనా దేవల్ కూడా వెంట ఉన్నారు. భర్త తరఫున పురస్కారం అందుకుంటూ హేమమాలిని భావోద్వేగానికి గురయ్యారు. షోలే, చుప్కే చుప్కే వంటి ఎన్నో మరపురాని చిత్రాలతో భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేసిన ధర్మేంద్ర, 2025 నవంబర్‌లో 89 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఇదే విభాగంలో ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు ఎన్. రాజం కూడా పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మ భూషణ్ పురస్కారాల విషయానికొస్తే, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యాపారవేత్త ఉదయ్ కోటక్‌ను వాణిజ్యం, పరిశ్రమల రంగంలో ఆయన చేసిన సేవలకు గాను పద్మ భూషణ్‌తో సత్కరించారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోష్యారి ప్రజా వ్యవహారాల విభాగంలో చేసిన కృషికి గాను పద్మ భూషణ్ అందుకున్నారు. ఇక పద్మ శ్రీ పురస్కారాల జాబితాలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ క్రీడా రంగంలో తన విశేష ప్రతిభకు గాను పద్మశ్రీ అవార్డును స్వీకరించారు. బెంగాలీ సినిమా సూపర్ స్టార్ ప్రసేన్జిత్ చటర్జీకి కళల విభాగంలో పద్మశ్రీ లభించింది. ఆయన 350కి పైగా చిత్రాలలో నటించి గుర్తింపు పొందారు. ప్రముఖ అడ్వర్టైజింగ్ దిగ్గజం, స్వర్గీయ పియూష్ పాండేకు కూడా మరణానంతరం పద్మశ్రీ ప్రకటించగా, ఆయన భార్య నీతా జోషి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వీరితో పాటు పారా-అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ప్రముఖ నటుడు, దర్శకుడు అరవింద్ వైద్య కూడా పద్మశ్రీ పురస్కార గ్రహీతలలో ఉన్నారు. ఇక, తెలుగు వాగ్గేయకారుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ తరఫున ఆయన తనయుడు పద్మశ్రీ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మిగిలిన పురస్కార గ్రహీతలకు త్వరలో జరగనున్న మరో కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

# ఎండ ఎరుపు

(మొదటి పేజీ తరువాయి)

పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. తొలిసారి వడగాల్పులపై రెడ్ అలర్ట్ జారీచేయడం ఇదే మొదటిసారి. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మంలో అతి తీవ్రస్థాయిలో వడగాల్పులు వీస్తాయని హెచ్చరించింది. ఈ ఐదు జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ సహా ఎనిమిది జిల్లాలో తీవ్ర వడగాల్పులకు అవకాశం ఉందన్న ఐఎండీ.. ఆరెంజ్ అలర్ట్ ఇచ్చింది. వీటితో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయ్యింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయట తిరగొద్దని సూచించింది. మరోవైపు, సోమవారం తెలంగాణలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. హైదరాబాద్ నగరంలో వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం కురవగా.. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం కురవడంతో ఎండల తీవ్రత నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. మెదక్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## భార్యాభర్తలకు ఎల్ఐసీ జాయింట్ లైఫ్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

ప్లాన్‌లో పరిమిత కాలం పాటు ప్రీమియం చెల్లించే సౌలభ్యం ఉంటుంది. ఒకే పాలసీ ద్వారా భార్యాభర్తలకు రక్షణ కల్పించడం, గ్యారెంటీడ్ రిటర్న్లు ఇవ్వడం, అలాగే అవసరానికి అనుగుణంగా డెత్ బెనిఫిట్స్ ఆప్షన్లను అందించడం ఈ ప్లాన్‌ల లక్ష్యమని ఎల్ఐసీ తెలిపింది. జూన్ 1 నుంచి ఈ పాలసీలు కొనుగోలు చేయవచ్చని వెల్లడించింది.

# మా జీవితాలకు గుర్తింపేది?

## అరకొర జీతాలు, వేధింపులు, బెదిరింపులు.. 20 ఏళ్లుగా అణచివేతలు, ఛీత్కారాలు

### ఎస్పీఎస్ అసోసియేషన్ మహా ధర్నా.. రూ.26 వేలు కనీస వేతనం చేయాలని డిమాండ్

కోఠి–హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): ఎస్పీఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న కార్మికులు ఈ ఆందోళనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 17,800 మంది కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందిస్తున్నప్పటికీ, తక్కువ వేతనాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్నప్పటికీ తమ జీవితాలకు గుర్తింపు లేకుండా పోయిందని రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య తెలిపారు. 2022లో విడుదలైన జీవో నెంబర్ 60 ప్రకారం నెలకు రూ.15,600 వేతనం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టు దళారీ వ్యవస్థ కారణంగా కార్మికులకు రూ.9,000 నుంచి రూ.10,000 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొనసాగుతున్న 'బెడ్‌సైడ్ కాంట్రాక్ట్ దళారీ వ్యవస్థ' వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని సంఘం




పేర్కొంది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నబోస్క నరేశ్ మాట్లాడుతూ, కార్మికులపై వేధింపులు, బెదిరింపులు కొనసాగితే సంఘం సహించబోదని హెచ్చరించారు. కార్మికుల హక్కుల కోసం ఎంత దూరమైనా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్ తెలిపారు. ఈ మహా ధర్నాలో రాష్ట్ర కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ యు. రమణ, ఉపాధ్యక్షులు వైనాల రవి, సహాయ కార్యదర్శులు గొర్రె నాగరాజు, నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు అంజలి, కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే:**

- కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26,000 ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలి
- బెడ్‌సైడ్ కాంట్రాక్ట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి
- ఐహెచ్‌ఎఫ్ఎంఎస్ సిబ్బందిని ఐఎఫ్ఎంఐఎస్‌లో విలీనం చేయాలి
- కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలి
- ఈపీఎఫ్ యాజమాన్య వాటాను ప్రభుత్వమే చెల్లించాలి
- మహిళా కార్మికులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలి

అలాగే రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ సభ్యులు, సుమారు 500 నుంచి 600 మంది కార్మికులు 40–45 డిగ్రీల ఎండలను సైతం లెక్కచేయకుండా ఆందోళనలో పాలుపంచుకొని ధర్నాను విజయవంతం చేశారు.

## పంట వ్యర్థాలను కాల్చొద్దు

**నేలలోని సేంద్రియ కర్బనంపై ప్రభావం**

**రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు**

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): రైతులు పంట అవశేషాలను కాల్చడం ద్వారా లాభాల కంటే అధిక నష్టాలు కలుగుతున్నాయని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గోపీ తెలిపారు. పంట వ్యర్థాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం పదార్థం దెబ్బతినడంతో పాటు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా నశిస్తాయి. దీని ప్రభావంతో భూసారం తగ్గి, భవిష్యత్‌లో రసాయన ఎరువులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ పంట వ్యర్థాల దహనంతో గాలి కాలుష్యం పెరగడం, ప్రజల ఆరోగ్య సమస్యలు తలెత్తడం జరుగుతుంది. వేసవి కాలంలో మంటలు వేగంగా వ్యాపించి ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూములపై, చెత్త మైదానాల్లో కానీ ఇతర ప్రదేశాలలో వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం పూర్తిగా నిషేధించబడింది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిహార రుసుము విధించబడుతుందన్నారు.సాధారణంగా చెత్తను కాల్చినట్లయితే రూ.5 వేలు, భారీ స్థాయిలో వ్యర్థాలను కాల్చినట్లయితే రూ.25 వేలు పర్యావరణ పరిహారం చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై చెత్తను బహిరంగంగా కాల్చకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం ద్వారా భూసారం మెరుగుపడటంతో పాటు సేంద్రీయ కార్బన్ పెరుగుతుంది. తద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గి పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది రైతులు ఇప్పటికీ పంట వ్యర్థాలను కాల్చివేస్తున్నారని తెలిపారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాకు చెందిన రైతులు చాగర్ల చంద్రమౌళి, భాగ్యమ్మలు పంట వ్యర్థాలు కాల్చే క్రమంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన తీవ్ర విచారం కలిగించిందని తెలిపారు. ఈ ఘటనలతో సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బందికి మెమోలు జారీ చేయడం జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించి భూముల సారాన్ని కాపాడుకోవాలని కోరారు.

## పాలిటెక్నిక్‌లో కొత్తగా 10 కోర్సులు

**అందుబాటులో మొత్తం 33,140 సీట్లు**

**టీజీ పాలిసెట్ తొలి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల**

**ఈ నెల 27 నుండి స్లాట్ బుకింగ్ ప్రారంభం**

**సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేన**

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): ఈ ఏడాది కొత్తగా పాలిటెక్నిక్ లో పది కొత్త కోర్సులను ప్రవేశపెట్టినట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. హైదరాబాద్ నాంపల్లిలోని కాలేజీ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో కొత్త కోర్సులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తెలంగాణ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (టీజీ పాలిసెట్–2026) మొదటి విడత ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ రేపటి నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యార్థులు మెరుగైన కాలేజీలు, కోర్సులలో సీట్లు పొందేందుకు వీలుగా ఎక్కువ సంఖ్యలో ఆప్షన్లను ఎంచుకోవాలని ఆమె సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 70 సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్రంలోని అన్ని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు సహాయ కేంద్రాలుగా అవకాశం కల్పించారు. రాష్ట్రంలో మొత్తం 111 పాలిటెక్నిక్ కళాశాలల్లో 33,140 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అందులో 59 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు కాలేజీల్లో 17,130 సాధారణ సీట్లు, 1,658 ఈడబ్ల్యూఎస్ సీట్లు కలిపి మొత్తం 18,788 సీట్లు ఉన్నాయి. 52 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాలిటెక్నిక్ కాలేజీల్లో 13,080 సాధారణ సీట్లు, 1,272 ఈడబ్ల్యూఎస్ కలిపి మొత్తం 14,352 సీట్లు ఉన్నాయి.

**ఈ ఏడాది కొత్తగా పది కొత్త కోర్సులు**

ఈ ఏడాది పాలిటెక్నిక్‌లో 10 కొత్త కోర్సులను ప్రవేశపెట్టారు. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్, బయో–టెక్నాలజీ, సెమీ–కండక్టర్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్, ల్యాండ్‌స్కేప్ డిజైన్‌తో పాటు సివిల్ ఇంజనీరింగ్‌లో బిల్డింగ్ సర్వీసెస్, రియల్ ఎస్టేట్ అండ్ వాల్యుయేషన్, కన్స్ట్రక్షన్ టెక్నాలజీ వంటి కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు గతంలో ఉన్న 25 సాంప్రదాయ, ఆధునిక కోర్సులు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, ట్రిపుల్ ఈ, మెకానికల్ మొదలైనవి) యథావిధిగా కొనసాగుతాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి సకాలంలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని అధికారులు కోరారు.

## రేవంత్ గారూ.. వ్యాట్ తగ్గించండి!

**సీఎం రేవంత్‌కు హరీశ్ బహిరంగ లేఖ**

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): పెట్రోల్, డీజిల్ ధరలపై వ్యాట్‌ను తక్షణమే కనీసం 10 శాతం తగ్గించాలని కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థికంగా నలిగిపోతోందన్న హరీశ్ రావు.. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఇంటి ఖర్చులు పెరగడం లాంటి కారణాలతో కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. పొదుపు తగ్గడంతోపాటు ప్రజల కొనుగోలు సామర్థ్యం కూడా తగ్గిందన్నారు. ఇంటిని నడపటం పేదలు, మధ్యతరగతికి శక్తికి మించిన భారంగా మారిందన్నారు. ద్రవ్యోల్బణం పెరగడానికి, ధరలు పెరగడానికి పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడమే అతిపెద్ద కారణమన్న హరీశ్ రావు.. ఇంధన ధరల పెంపు వల్ల ప్రతి రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. రవాణా, వ్యవసాయం, ఆహార ధరలు, నిత్యావసరాలు, స్కూల్ ఫీజులు, బస్సు ఛార్జీలు, రోజువారీ ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. ఇంధనం ధరలు పెంపు ప్రభావం నేరుగా సామాన్య కుటుంబాల బడ్జెట్‌పై పడుతోందన్నారు. పెరుగుతున్న ధరలు, పెరుగుతున్న పన్నుల మధ్య సామాన్యుడు నలిగిపోతున్నాడని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బంది పడుతుంటే.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పెట్రోల్ ధరల పెంపు వల్ల లాభపడుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు మే 15 నుంచి నాలుగు దఫాలుగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు దాదాపు రూ.7.50 పెంచాయన్నారు. ఫలితంగా పెట్రోల్ ధరలు హైదరాబాద్



లీటర్‌కు రూ.115 దాటితే, డీజిల్ ధర లీటర్‌కు రూ.103 దాటిందన్నారు. పెట్రోల్ ధరల పెంపు వల్ల తెలంగాణ ప్రభుత్వానికి అదనంగా భారీ ఆదాయం సమకూరుతోందని హరీశ్ రావు తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన ప్రతిసారి ఆటోమెటిగ్గా తెలంగాణ వ్యాట్ కలెక్షన్లు పెరుగుతున్నాయన్నారు. తెలంగాణలో సగటున నెలకు 27 కోట్ల లీటర్ల పెట్రోల్, 45 కోట్ల లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నారన్న హరీశ్ రావు.. పెట్రోల్‌పై 35.2 శాతం, డీజిల్‌పై 27 శాతం చొప్పున వ్యాట్ వసూలు చేస్తున్నారన్నారు. లీటర్‌కు రూ.7.50 చొప్పున ఇంధనం ధరలు పెంచడం వల్ల లీటర్ పెట్రోల్‌పై అదనంగా రూ.2.64, డీజిల్‌పై రూ.2.025 చొప్పున వ్యాట్ పెరుగుతోందని.. దీని వల్ల తెలంగాణ ప్రభుత్వానికి నెలకు రూ.162.41 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతోందన్నారు. ఈ లెక్కన ఏడాదికి రూ.1948.92 కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు.

## గోహత్యలు ఆపేందుకు చర్యలు తీసుకుంటా

**వీహెచ్‌పీ నేతలతో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): రాష్ట్రంలో చట్ట విరుద్ధమైన గోహత్యలను ఆపేందుకు తన వంతు చర్యలు తీసుకుంటానని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించడం శిక్షార్హమన్నారు. సమాజంలో అందరి విశ్వాసాలను గౌరవించాల్సిందేనని గవర్నర్ అభిప్రాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం విశ్వహిందూ పరిషత్ తెలంగాణ బృందం గవర్నర్‌ను కలిసింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ గోరక్ష, సాధుసంతులు విభాగం నాయకులు గవర్నర్‌కు కొన్ని విషయాలు నివేదించారు. రాష్ట్రంలో అక్రమ భైందోవర్లు కొనసాగిస్తూ.. తమ కార్యకర్తలను భయభ్రాంతులను గురి చేస్తున్నారని వాపోయారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ.. మజ్లీస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసు యంత్రాంగం తీరును వివరించారు. బక్రీద్ సందర్భంగా బలిచ్చేందుకు వేలాది గోమాతలను ఇప్పటికే డంపు చేసి ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని విడిపించి గోషాలలకు తరలించడంలో పోలీసులు విఫలమవుతున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో హిందువుల మనోభావాలకు ఏమాత్రం గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది గోమాతలు హత్యకు గురవుతుంటే పాలకులకు కనికరం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటుకు ఇచ్చిన విలువ ఆవుకి ఇవ్వడం లేదని, హిందువుల విశ్వాసాలపై దాడులు చేస్తున్నారని తీవ్ర



ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి ఉపయోగించే పశువులను, మూడు సంవత్సరాల వయసుగల లేగ దూడలను అత్యంత ఘోరంగా హింసించి, వధిస్తున్నారని చెప్పారు. ఈ విషయాలపై సానుకూలంగా స్పందించిన గవర్నర్ మాట్లాడుతూ.. తన పరిధిలో ఉన్న అధికారాలను ఉపయోగించి గోవుల రక్షణకు తక్షణమే చర్యలు చేపడతానని విశ్వహిందూ పరిషత్ నాయకులకు చెప్పారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు యాదగిరిరావు, రమేశ్, పగుడాకుల బాలస్వామి , సుభాష్ చందర్, దుర్గానందపురి స్వామి, విశోక తీర్థ స్వామి , శ్రీకాంత్ ఇంద్ర స్వామి, కృష్ణ చాముండేశ్వరి నాథ స్వామి, హరి కిషన్ శర్మ , రేగు అనిల్ పాల్గొన్నారు.

## ఫాంహౌస్‌లో ఉండుడు కాదు..
## వచ్చి ఇందిరమ్మ ఇండ్లు చూడు!

**రెండున్నరేండ్లలోనే 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నాం**

**కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి ఫైర్**

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్‌కు.. ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లపై కేటీఆర్‌కు సవాల్ విసిరిన మంత్రి పొంగులేటి.. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందన్నారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి పొంగులేటి వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలోని 3



కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని, మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. 'రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటున్న డ్రామారావు .. అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొట్టి, లోక్‌సభ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాల్లో కూడా మిమ్మల్ని ఓడగొట్టిన ప్రజలంతా.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదు. డబుల్ బెడ్ రూం ఇండ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదు. సవాల్‌కు సిద్ధమేనా కేటీఆర్ గారు?' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

– శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## నిజమే ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం

**ప్రభుత్వం తరపున నేను క్షమాపణ చెప్తున్నా**

**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

మునుగోడు, మే 25 (ఈవార్తలు): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ధాన్యం సేకరించే విషయంలో కొంత ఆలస్యం జరిగిందని అంగీకరించారు. ఈ విషయంలో ప్రభుత్వం తరఫున తాను క్షమాపణలు కోరుతున్నానన్నారు. సోమవారం మునుగోడులో మీడియాతో మాట్లాడిన ఆయన.. పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల వల్ల హమాలీల కొరత, కొంత మంది మిల్లర్ల రాజకీయంగా బ్లాక్ మెయిలింగ్ ధోరణిలో వ్యవహరించడం వల్ల ధాన్యం సేకరించే విషయంలో ఆలస్యం అయిందన్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడ్డారని ఈ విషయంలో తామంతా చింతిస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. రాబోయే 10 రోజుల్లో రైతుల వద్ద ఉన్న పూర్తి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడు రాలేదని గతంతో పోలిస్తే ఈ సారి ధాన్యం దిగుబడి రెట్టింపు అయిందని చెప్పారు. రైతు సోదరులు పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. ప్రతిపక్షాలు చేసిన పోరాటాలను ప్రభుత్వం సానుకూల ధోరణిలోనే చూస్తోందన్నారు. ఇది రైతుల సమస్య అని ప్రతిపక్షాలు, ప్రభుత్వం సహకారంతో ముందుకు వెళ్తే పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తవుతుందని చెప్పారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ మధ్య రాజకీయ దుమారం రేగింది. రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ మేరకు ఇవాళ బీజేపీ బస్సు యాత్ర ప్రారంభించగా బీఆర్ఎస్ నేతలు కల్లాల వద్దకు వెళ్లి అక్కడ పరిస్థితిని పరిశీలించారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని బీజేపీ విమర్శించగా, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే.. కలెక్టరేట్ ముట్టడిస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రతిపక్షాల విమర్శలపై స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. రైతులను అడ్డం పెట్టి బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతోందని ఫైర్ అయ్యారు.

## బస్సు చార్జీలు పెంచం: ఆర్టీసీ

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): ఇరాన్ యుద్ధ పరిణామాలతో అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు ఒడిదుడుకులకు లోనవుతున్నా.. రాష్ట్ర ప్రజలపై ఆ భారాన్ని మోపకూడదని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. డీజిల్ ధరలు భారీగా పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతానికి బస్సు ఛార్జీలను పెంచే ఆలోచన ఏదీ లేదని సంస్థ ఎండీ వై. నాగిరెడ్డి స్పష్టం చేశారని తెలుస్తోంది. ప్రస్తుతానికి ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ ధరల్లో మార్పులు ఉండబోవని, పాత ఛార్జీలతోనే బస్సులు నడుపుతామని యాజమాన్యం పేర్కొందని... అయితే, భవిష్యత్తులో ఇంధన ధరలు ఒక చోట స్థిరపడిన తర్వాత, అప్పటి పరిస్థితులను బట్టి ఛార్జీల సవరణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంధన ధరల పెరుగుదల టీజీఎస్ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సంస్థ అంతర్గత లెక్కల ప్రకారం.. లీటర్ డీజిల్ ధర కేవలం ఒక్క రూపాయి పెరిగినా, సంస్థకు నెలకు అదనంగా రూ. 1 కోటి 28 లక్షల అదనపు భారం పడుతుంది.

# కేంద్రం రోజూవారీ దోపిడీ

**పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై ఖర్గే**



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులకు బదలాయిస్తున్నాయి. ఈరోజు మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దీంతో లీటర్ పెట్రోల్‌పై రూ. 2.84, డీజిల్‌పై రూ. 2.86 చొప్పున పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలు గత రెండు వారాల్లో పలుమార్లు పెరిగాయి. దీంతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12, లీటర్ డీజిల్ రూ. 95.25గా, హైదరాబాద్‌లో పెట్రోల్ రూ. 115.58, డీజిల్ ధర రూ. 103.74గా ఉంది. పెట్రోల్, డీజిల్ పెరుగుదలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. రెండు వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయని మండిపడ్డారు. 2014లో లీటర్ పెట్రోల్ రూ. 71.41గా ఉంటే ఇప్పుడు రూ. 102.12కు చేరుకుందని గుర్తు చేశారు. రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని హెచ్చరించారు. గత పన్నెండేళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ. 43 లక్షల కోట్లు దోచుకుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ షేర్లు పెరిగినట్లు చెప్పారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్‌ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తోందని అన్నారు.

## పన్నులు తగ్గిస్తే 1 లక్ష కోట్ల నష్టం

**కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి**

న్యూఢిల్లీ: దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ. లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై స్పందించిన నిర్మల.. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

## నేరం చేయాలంటేనే భయపడాలి

**నిందితులకు కఠిన శిక్షలు పడాలి**

**తమిళనాడు సీఎం విజయ్**

చెన్నై: తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల విషయంలో కేసులను తక్షణమే నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు రాష్ట్ర సచివాలయంలో శాంతిభద్రతలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం విజయ్ మాట్లాడుతూ.. లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో జాప్యం జరగకూడదని అన్నారు. చట్టపరమైన చర్యలను అనుసరించి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి, నేరగాళ్లకు కఠిన శిక్షలు పడితే, భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేయడానికి ఇతరులు భయపడతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా దర్యాప్తు సంస్థలు, సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం కూడా చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. సాయికుమార్, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. మణివాసన్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్, డీజీపీ డాక్టర్ సందీప్ రాయ్ రాథోడ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ సిబ్బంది రక్షణకు ప్రత్యేక చర్యలు

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**


జగిత్యాల, మే 25 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఆరోగ్య రక్షణ కోసం జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం స్థానిక ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ గాగుల్స్, వాటర్ ఫ్లాస్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సిబ్బంది ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, జాతీయ రహదారుల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా కలిగే డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్, అలసట వంటి ఆరోగ్య సమస్యల నుంచి సిబ్బందిని రక్షించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. రోడ్లపై వాహన రాకపోకలను క్రమబద్ధీకరించడం మాత్రమే కాకుండా రోడ్డు ప్రమాదాల నివారణలో కూడా ట్రాఫిక్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాంటి సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడటం పోలీస్ శాఖ బాధ్యత అని అన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది తరచూ నీరు తాగుతూ శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. అవసరమైతే కొద్దిసేపు నీడలో విశ్రాంతి తీసుకోవాలని, ఎండ తీవ్రతను నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. ప్రజల సేవలో ముందుండే పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలరని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్తులో కూడా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం, సుప్రియ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఫ్రాన్స్ నుంచి మరో 114 రఫేల్స్

## యుద్ధ విమానాల కొనుగోలు భారత్ రెడీ.. ఫ్రాన్స్‌కు లేఖ సిద్ధం చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళాన్ని మరింత శక్తిమంతం చేసే దిశగా రక్షణ శాఖ కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అధికారిక ప్రతిపాదన లేఖను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. రాబోయే కొన్నిరోజుల్లోనే దీన్ని ఫ్రాన్స్ ప్రభుత్వానికి పంపించనున్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా దాదాపు 90 యుద్ధ విమానాలను 'మేకిన్ ఇండియా' కింద ఇక్కడే తయారు చేయనున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్, ఓ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి వీటిని మనదేశంలోనే ఉత్పత్తి చేస్తుంది. మిగిలిన విమానాలను మాత్రం నేరుగా ఫ్రాన్స్ నుంచి ఎగిరివచ్చే (ఫ్లై-అవే) స్థితిలో దిగుమతి చేసుకుంటారు. మన లేఖకు ఫ్రాన్స్ స్పందించిన తర్వాత అధికారికంగా టెండర్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారతదేశ రక్షణ అవసరాలకు సరిపోయేలా ఈ రఫేల్ విమానాల్లో కనీసం 50 శాతం మేర స్వదేశీ సాంకేతికత, విడిభాగాలనే ఉపయోగించాలని ఢిల్లీ గట్టిగా పట్టుబడుతోంది. ఈ రఫేల్ ఉత్పత్తి ప్రక్రియలో భారతీయ కంపెనీల పాత్రను మరింత విస్తృతం చేయాలని ఫ్రాన్స్‌ను కోరింది. భవిష్యత్తులో జరగబోయే రక్షణ సహకారాలు కేవలం కొనుగోళ్లకే పరిమితం కాకుండా, ఇరు దేశాలు కలిసి డిజైన్, అభివృద్ధి చేసేలా ఒప్పందాలు ఉండనున్నాయి. భారత వైమానిక దళంలో ఇప్పటికే 36 రఫేల్ యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. అలాగే నౌకాదళం కోసం మరో 26 రఫేల్-ఎమ్ విమానాల కొనుగోలు ప్రక్రియ కూడా నడుస్తోంది. ఇప్పటికే మనదేశంలో రఫేల్ విమానాలకు సంబంధించిన మెయింటెనెన్స్, శిక్షణ మౌలిక వసతులు ఉండటం వల్ల, మరిన్ని కొత్త విమానాలు వస్తే వాటి రవాణా, నిర్వహణ ఖర్చులు, పైలట్ల శిక్షణ వ్యయం భారీగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొనుగోలు ప్రతిపాదనకు 'డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్' ఇప్పటికే ప్రాథమిక క్లియరెన్స్ ఇచ్చింది. ఇప్పుడు పంపించబోయే లేఖకు ఫ్రాన్స్ నుంచి ధరలు, డెలివరీ సమయం, లాజిస్టిక్స్ మద్దతు వంటి వివరాలతో సమాధానం వస్తుంది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య తుది చర్చలు జరుగుతాయి. ఈ రక్షణ ఒప్పందంపై సంతకాలు చేయడానికి ముందు ప్రధాని నేతృత్వంలోని 'క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ' తుది ఆమోదం తెలపాల్సి ఉంటుంది.



## లాభాలే లాభాలు

**1073 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్**

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న ఆశలతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల సెంటిమెంట్ బలపడింది. ఈ ప్రభావంతో సూచీలు రోజంతా లాభాల్లోనే పయనించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,073.61 పాయింట్లు లాభపడి 76,488.96 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 312.4 పాయింట్లు పెరిగి, కీలకమైన 24,000 మార్కును తిరిగి అధిగమించి 24,031.7 వద్ద ముగిసింది. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహం నెలకొంది. ఈ వ్యాఖ్యలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న అంచనాలు పెరిగి, ప్రపంచవ్యాప్తంగా రిస్క్ ఆస్తులకు మద్దతు లభించింది. టెక్నికల్ పరంగా, నిఫ్టీకి 24,100 వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని దాటితే 24,300 - 24,350 జోన్ తదుపరి నిరోధకంగా పనిచేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, 23,950 - 24,000 స్థాయి కీలక మద్దతుగా మారిందని తెలిపారు. ఈ ర్యాలీకి బ్యాంకింగ్ రంగ షేర్లు నాయకత్వం వహించాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు మెరుగైన ప్రదర్శన చేశాయి. బ్రాడర్ మార్కెట్లోనూ కొనుగోళ్ల సందడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.94 శాతం, స్మాల్‌క్యాప్ 1.37 శాతం చొప్పున లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐషర్ మోటార్స్, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి.

## ఎన్టీఏ ఇంకా పాఠాలు నేర్చుకోలేదు

**నీట్ పేపర్ లీక్‌లపై సుప్రీంకోర్టు ఫైర్**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నీట్ పేపర్ లీక్ ఘటనలపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఎన్ని ఆదేశాలు ఇచ్చినా, ఎన్ని వివాదాలు తలెత్తినా 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఇప్పటికీ ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారించిన కోర్టు.. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని ఫైమా, యూడీఎఫ్ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. లోపభూయిష్టంగా మారిన ఎన్‌టీఏ స్థానంలో సరికొత్త వ్యవస్థను తీసుకురావాలని లేదా దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోర్టును కోరారు.

## రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్



**హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట**

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ. 13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్‌ఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, హెచ్‌ఎంఆర్‌ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## రియల్ వర్సిటీ ఆధ్వర్యంలో

# గ్రోత్ కాన్‌క్లేవ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ



హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): రియల్ వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "రియల్టర్స్ గ్రోత్ కాన్‌క్లేవ్ 2026" కార్యక్రమ పోస్టర్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జగన్ గురు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఫౌండర్ ఉరుకుందు శెట్టి జగన్ గురూజీ నాయకత్వం వహించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సురేష్ కుమార్, మల్లేష్ యాదవ్, విజయేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి, వ్యాపార అవకాశాలు, నెట్‌వర్కింగ్, మార్కెటింగ్ నైపుణ్యాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కాన్‌క్లేవ్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ గురు మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలో ముందుకు రావాలని, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్‌కు దోహదపడతాయని అన్నారు. ఫౌండర్ ఉరుకుందు శెట్టి జగన్ గురూజీ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు సభ్యులు, ఆహ్వానితులు, రియల్ ఎస్టేట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్




బాగ్‌లింగంపల్లి–హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న సూపర్ పవర్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎస్‌వీకే వెనుక భాగంలో ఉన్న నెబర్‌హుడ్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా నాగేందర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రధాన పరీక్షాధికారిగా అంతర్జాతీయ క్రీడాకారుడు, 6వ డాన్ బ్లాక్ బెల్ట్ మోయిన్ సర్ వ్యవహరించారు. సూపర్ పవర్ తైక్వాండో అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, 3వ డాన్ బ్లాక్ బెల్ట్ పీ. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తైక్వాండో ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరుగుతాయని తెలిపారు. అలాగే శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం మెరుగుపడటానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 2వ డాన్ బ్లాక్ బెల్ట్ కోచ్ జి.వి. కార్తీక్తో పాటు కోచ్‌లు నిలయ, సంజనా, మోక్షిత, రుద్రాక్ష్, రవి కిరణ్, ఓ. కార్తికేయ, మట్టా హర్షిత్ పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమ నిర్వహణలో వేణు కీలక పాత్ర పోషించారు. తైక్వాండో శిక్షణ వల్ల విద్యార్థులు శారీరకంగా దృఢంగా మారడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం చివర్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు.



## నవదుర్గపీఠంలో దావ వసంత పూజలు

జగిత్యాల టౌన్, మే 25 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని నవదుర్గపీఠ క్షేత్రంలో నిర్వహిస్తున్న అధిక జ్యేష్ఠ మాస జప కార్యక్రమంలో జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్రంలో ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆమె ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

**కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఆందోళన**

**రోజులుగా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు**

ధర్మారం, మే 25 (ఈవార్తలు): సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ధర్మారం మండలంలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వరి ధాన్యం తడిసిపోయింది. దీంతో ఇప్పటికే పంట విక్రయాల కోసం ఎదురుచూస్తున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మందగించడం, తూకం ప్రక్రియలో జాప్యం చోటుచేసుకోవడంతో రైతులు పంటను కేంద్రాల వద్దే నిల్వ ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కురిసిన అకాల వర్షం రైతుల కష్టంపై మరింత భారంగా మారింది. ముందస్తు రక్షణ చర్యలు, తగిన టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం సంచులపై వర్షపు నీరు నేరుగా పడింది. దీంతో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని, తేమ శాతం పెరిగితే మద్దతు ధర కోల్పోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల కష్టం, పెట్టుబడులు పెట్టి పండించిన పంట ఇలా వర్షానికి తడవడంతో తీవ్ర నష్టపోతున్నామని వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని రైతులు అధికారులను కోరుతున్నారు. అలాగే నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



## గంగాపూర్‌లో మహిళా సంఘ భవన ప్రారంభం

**పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

బుగ్గారం, మే 25 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌జీఈఎస్ నిధుల ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా సంఘ భవనాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా మహిళా సంఘ భవనం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణాభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి భవనాలు ఉపయోగపడతాయని, మహిళల సాధికారత కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు, మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, మహిళా సంఘ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంజాయి ముఠా అరెస్టు



జగిత్యాల రూరల్, మే 25 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 1.675 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చల్గల్ గ్రామంలో గంజాయి అక్రమ రవాణాపై వచ్చిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. జగిత్యాల రూరల్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1.675 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు గంజాయి సరఫరా కోసం వచ్చినట్లు అంగీకరించినట్లు తెలిపారు. డబ్బులు పంపించిన మరో నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో ఒడిశాకు చెందిన మరో వ్యక్తి పాత్ర వెలుగులోకి వచ్చిందని, అతడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. విచారణలో ప్రధాన నిందితుడు తాటిపాముల వంశీ గతంలో ఉపాధి కోసం బహ్రెయిన్‌లో పనిచేసి తిరిగి స్వగ్రామానికి వచ్చాడని పోలీసులు తెలిపారు. స్నేహితుల ద్వారా గంజాయి సేవించే అలవాటు ఏర్పడగా, అధిక లాభాల కోసం గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. గతంలో ఒడిశాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులో కూడా అతడు అరెస్టై జైలుకు వెళ్లినట్లు వివరించారు. తర్వాత మళ్లీ ఒడిశాకు వెళ్లి సుమారు 1.6 కిలోల గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు విచారణలో తేలిందన్నారు. మరో నిందితుడు మెండే అనిల్ గత నాలుగేళ్లుగా గంజాయి సేవిస్తున్నట్లు, గంజాయి కొనుగోలు కోసం ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించినట్లు వెల్లడించినట్లు తెలిపారు. దేవకోట కుశాల్ కూడా గంజాయి విక్రయాల కోసం నగదు పంపించినట్లు అంగీకరించినట్లు చెప్పారు. నిందితుల వద్ద నుంచి 1.675 కిలోల గంజాయి, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన జగిత్యాల రూరల్ ఎస్సై ఎస్. ఉమాసాగర్‌తో పాటు పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అక్రమ రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.



## ముందు వడ్ల సంగతి చూడుండ్రి!

**పెట్రోల్ సంగతి తర్వాత.. కాంగ్రెస్ నేతలకు ఆర్టీసీ డ్రైవర్ చురకలు**

జగిత్యాల, మే 25 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా జగిత్యాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఓ ఆర్టీసీ డ్రైవర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు వాహనాలను మళ్లించారు. ఇదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ తన వాహనంలో నుంచి స్పందిస్తూ, "వడ్లు, మొక్కజొన్నల గురించి పట్టించుకోండి.. పెట్రోల్ రేట్లు ఎప్పుడైనా తగ్గొచ్చు" అంటూ వ్యాఖ్యానించినట్లు అక్కడున్న వారు తెలిపారు. ఈ వ్యాఖ్యలు అక్కడ ఉన్న పలువురి దృష్టిని ఆకర్షించగా, కొందరు తమ మొబైల్ ఫోన్లలో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వీడియో వేగంగా వైరల్ అవుతోంది. రైతుల సమస్యలు, ధాన్యం కొనుగోళ్లు, పంటల పరిస్థితులపై డ్రైవర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.



## టీజీబీఎల్‌కు సుధాన్వి ఎంపిక

**నిజాం రాయల్స్ జట్టులో చోటు**

జగిత్యాల, మే 25 (ఈవార్తలు): తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ జూనియర్ బాస్కెట్‌బాల్ లీగ్ (టీజీబీఎల్) అండర్–15 టోర్నమెంట్‌లో జగిత్యాలకు చెందిన క్రీడాకారిణి వడ్డెపల్లి సుధాన్వి అరుదైన ఘనత సాధించింది. ఇటీవల నిర్వహించిన టీజీబీఎల్ ఆటగాళ్ల వేలంలో ఆమె ప్రతిభ చాటి నిజాం రాయల్స్ జట్టుకు ఎంపికైంది. జగిత్యాల పట్టణానికి చెందిన మహేష్ కుమార్––లక్ష్మీ కుమారి దంపతుల కుమార్తె సుధాన్వి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఈ లీగ్‌కు ఎంపికైన తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. దేశంలోనే తొలిసారిగా జూనియర్ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ లీగ్‌కు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించగా, కఠినమైన ఎంపిక పరీక్షలు, వేలం ప్రక్రియలో సుధాన్వి తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకున్న సుధాన్విపై ఉమ్మడి జిల్లా క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానికులు అభినందనలు తెలియజేస్తున్నారు. రానున్న టోర్నమెంట్‌లో మరింతగా రాణించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.



## పెట్రో ధరలను తగ్గించాలి

**మోదీపై కేసీఆర్, జీవన్ రెడ్డి మాట్లాడరేం?**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఫైర్.. పెట్రో ధరల పెంపుపై నిరసన**

జగిత్యాల, మే 25 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తు జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్ప పేద ప్రజల సంక్షేమం ఏనాడు పట్టించుకోవడంలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి మోడి పెట్రోల్, డీజిల్ ధరల విషయం మాట్లాడలేదన్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు, కేరళ మరియు పచ్చిమబెంగాల్ ఎన్నికల పూర్తి అయిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మంత్రి ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వం దేశ ప్రజలు ఎవ్వరు విలాసవంతాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చిందని దీని అర్థం మన దేశ ఆర్థిక వ్యవస్థ అస్థవ్యస్తంగా మారిందని భావించవచ్చన్నారు. రూపాయి విలువ రోజు రోజుకు పడిపోతున్న మోడి మాత్రం నిద్ర లేవడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ నరేంద్ర మోడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, జీవన్ రెడ్డిలు ఎందుకు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదని మంత్రి ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు బండి భగీరథ్ అంశంపై ఎందుకు బీఆర్‌ఎస్ నాయకులు నోరు మెదపడం లేదని, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మీద ఉన్న దృష్టి ధాన్యం కొనుగోలు, మక్కల కొనుగోలుపై లేదని ఆరోపించారు. రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పంటల వడ్లు కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎఫ్ సీఐ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం సేకరించడం లేదన్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మిగిలిన లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు తగ్గించాలని రాష్ట్రంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన మక్కలతో పాటు ఎఫ్ సీ ఐ ద్వార బియ్యం సేకరించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, జగిత్యాల జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## సూటిపోటి మాటలతో సంపుతోంది!

**నా బిడ్డ తిట్లకు బతకాలనిపిస్తలే**

**చచ్చిపోతా.. అనుమతియ్యుండ్రి సారూ!**

**జగిత్యాల ప్రజావాణిలో వృద్ధురాలి ఆవేదన**

కొడిమ్యాల/జగిత్యాల, మే 25 (ఈవార్తలు): కూతురి వేధింపులు భరించలేక ఓ 80 ఏళ్ల వృద్ధురాలు ప్రజావాణిలో అధికారుల ఎదుట కన్నీరుమున్నీరైంది. "ఇలా నరకం అనుభవించే బదులు చనిపోవడమే మేలు.. కారుణ్య మరణానికి అనుమతివ్వండి" అంటూ విలపించింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ఎంగ్రికాయల గంగవ్వ భర్త ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ మరణించారు. భర్త మరణం అనంతరం కారుణ్య నియామకం కింద తన మూడో కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా గంగవ్వ కృషి చేసింది. ఆ సమయంలో కుటుంబ ఆస్తులపై తనకు ఎలాంటి హక్కులు ఉండవని ఆ కుమార్తె పెద్దల సమక్షంలో ఒప్పంద పత్రం కూడా రాసిచ్చినట్లు గంగవ్వ తెలిపింది. అయితే ఉద్యోగం వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయని వృద్ధురాలు వాపోయింది. గత 27 ఏళ్లుగా తన మూడో కుమార్తె ఇంట్లోనే ఉంటూ మానసికంగా వేధింపులకు గురిచేస్తోందని ఆరోపించింది. అంతేకాకుండా తన వద్ద ఉన్న రూ.9 లక్షల నగదు, మూడు తులాల బంగారం తీసుకుని గొడవపడి ఇంటిని విడిచి వెళ్లిపోయిందని తెలిపింది. కూతురి వేధింపులు, ప్రాణభయంతో ప్రస్తుతం తాను తన పెద్ద కుమార్తె ఇంట్లో ఆశ్రయం పొందుతున్నానని గంగవ్వ పేర్కొంది. ఇటీవల మూడో కుమార్తె తిరిగి వచ్చి తల్లి ఇంటి తాళాలు పగులగొట్టి బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించిందని ఆరోపించింది. వృద్ధురాలైన తనను సొంత ఇంట్లోకే రానివ్వకుండా, వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై ఇప్పటికే కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని గంగవ్వ తెలిపింది. సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్లు, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ ఎన్నోసార్లు తిరిగినా ఎలాంటి ఫలితం కనిపించలేదని వాపోయింది. వృద్ధాప్యంలో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న తనకు ఈ పరిస్థితులు మరింత భారంగా మారాయని, ఇక ఈ బాధలను భరించే శక్తి లేదని గంగవ్వ కన్నీటి పర్యంతమైంది. న్యాయం దొరకకపోతే కారుణ్య మరణానికైనా అనుమతివ్వాలని అధికారులను వేడుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

## భారీ ఈదురు గాలులతో వర్షం

**కూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు**

హైదరాబాద్, మే 25 (ఈవార్తలు): హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రాజధాని నగరంలోని వనస్థలిపురం, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జనగామ జిల్లా నర్మెట్ట మండలంలో భారీగా వచ్చిన ఈదురుగాలులకు ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం కురిసింది. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం కురవడంతో ఎండల తీవ్రతకు ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మెదక్ సహా పలు ప్రాంతాల్లో మార్కెట్ యార్డులు, ధాన్యం సేకరణ కేంద్రాల్లో బస్తాలు తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

లయ్యారి చిత్రం


సీరత్ కపూర్



# రణవీర్ సింగ్‌పై బాలీవుడ్ నిషేధం

క్రేజీ ప్రాజెక్ట్ 'డాన్ 3' నుండి అకస్మాత్తుగా తప్పుకున్నాడనే కారణంతో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్‌పై నిషేధం విధించింది. ఇండస్ట్రీకి చెందిన ఎవరూ ఆయనకు సహకరించకూడదంటూ 'నాన్-కోఆపరేషన్' ఆదేశాలు జారీ చేసింది. షూటింగ్ ప్రారంభానికి కేవలం మూడు వారాల ముందే రణ్‌వీర్ తప్పుకోవడంతో, ప్రీ-ప్రొడక్షన్ రూపంలో తమకు రూ.40 కోట్ల నష్టం వాటిల్లిందని నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వానీ ఆరోపించారు. స్క్రిప్ట్ విభేదాల వల్లే రణ్‌వీర్ తప్పుకున్నట్లు ప్రచారం జరగగా, దీనిపై వివరణ ఇవ్వాలని మూడుసార్లు నోటీసులు పంపినా ఆయన స్పందించలేదు. దీంతో ఏ విభాగానికి చెందిన కార్మికులు, టెక్నీషియన్లు రణ్‌వీర్‌తో కలిసి పనిచేయకూడదని ఫెడరేషన్ చీఫ్ అడ్వైజర్ అశోక్ పండిట్ స్పష్టం చేశారు. ఈ నిర్ణయం రణ్‌వీర్ నటిస్తున్న ఇతర సినిమాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్‌ల కెరీర్‌లో మైల్‌స్టోన్‌గా నిలిచిన 'డాన్' ఫ్రాంచైజీలో ఇప్పుడు హీరో ఎవరనే సందిగ్ధత నెలకొంది. రణ్‌వీర్ స్థానంలో హృతిక్ రోషన్‌ను సంప్రదించినట్లు వార్తలు వచ్చినా, ఆయన టీమ్ వాటిని ఖండించింది. ప్రస్తుతం ఈ నిషేధ ఉదంతం బాలీవుడ్‌లో చిలికి చిలికి గాలివానగా మారి తీవ్ర సంచలనం రేపుతోంది.

# ఎగ్జిబిటర్ల వివాదంలోకి చిరు ఎంట్రీ



పర్సంటేజీ విధానం కేవలం 'పెద్ది'కి సంబంధించినది మాత్రమే కాదని, పరిశ్రమకు సంబంధించినదని తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు అన్నారు. ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య ఉన్న పర్సంటేజీ విధానానికి సంబంధించిన సమస్య రెండు రోజుల్లో పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఎగ్జిబిటర్లు, నిర్మాతలు ఈరోజు మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. చిరంజీవిని కలిసిన వారిలో నిర్మాతలు దిల్ రాజు, సురేశ్ బాబు, కేఎల్ నారాయణ, అల్లు అరవింద్ తదితరులు ఉన్నారు. దాదాపు గంటకు పైగా సమావేశమయ్యారు. ఎగ్జిబిటర్లు కోరుతున్న పర్సంటేజీ విధానం అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై ఒక నిర్ణయానికి రావాలని నిర్మాతలు, ఎగ్జిబిటర్లకు చిరంజీవి సూచించారని తెలుస్తోంది. అందరికీ ఆమోదయోగ్య నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ, పర్సంటేజీ విధానంపై ఎగ్జిబిటర్లు అన్ని విషయాలను చిరంజీవికి వివరించారని, ఆయన అన్ని అంశాలను సానుకూలంగా విన్నారని తెలిపారు. ఫిల్మ్ ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి మరిన్ని వివరాలు తెప్పించుకుంటానని మెగాస్టార్ చెప్పారని అన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వివరాలను ఛాంబర్ ప్రకటిస్తుందని అన్నారు.



# జోష్‌లో కార్తి 30 షూటింగ్

కార్తి పుట్టినరోజు సందర్భంగా 'కార్తి-30' చిత్రబృందం అభిమానులకు అదిరిపోయే బర్త్‌డే ట్రీట్ ఇచ్చింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ కూడా సోమవారం నుంచే ప్రారంభమైనట్లు అనౌన్స్ చేశారు. బర్త్‌డే ట్రీట్‌తో పాటు చిత్రబృందం మరో క్రేజీ హింట్ ఇచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టైటిల్, పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. కళ్యాణ్ శంకర్ మార్క్ కామెడీ టైమింగ్, కార్తి యాక్షన్ పర్ఫార్మెన్స్ తోడవుతుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక కార్తి కెరీర్‌లో మైల్‌స్టోన్‌గా నిలిచిపోయే ఈ 30వ చిత్రాన్ని టాలీవుడ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌస్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కార్తి సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. లండన్‌లో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో మీనాక్షి చౌదరి వైట్ కలర్ శారీ, గ్రీన్ కలర్ బ్లౌజ్ ధరించి ట్రెడిషనల్ లుక్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది.

# సెక్స్ బూతు కాదు



'పొలిమేర' సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్ ఇండస్ట్రీకి వచ్చిన కామాక్షి భాస్కర్ల ఫుల్ ఫేమ్ రాబట్టుకుంది. ఆ తర్వాత చేసిన వీరూపాక్ష బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో అమ్మడు రేంజ్ మారిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు ఎంఎస్ రాజు దర్శకత్వంలో రాబోతున్న 'అగధ'తో కీలక పాత్రలో కనిపించనుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కామక్షి చేసిన బోల్డ్ స్టేట్‌మెంట్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తన చిన్నతనంలో జరిగిన ఒక భయంకరమైన చేదు అనుభవాన్ని కామాక్షి బయటపెట్టింది. అందరూ తనలాగే ఆలోచించాలనే రూల్ లేదని కానీ, తనకు కేవలం 4 ఏళ్ల వయసు ఉన్నప్పుడే మొదటిసారి లైంగిక వేధింపులకు గురైనట్లు ఈవేదన వ్యక్తం చేసింది. ఆ తర్వాత టీనేజ్‌లో కూడా మరో మూడేళ్ల పాటు దారుణమైన వేధింపులను ఎదుర్కొన్నట్లు ఎమోషనల్ అయింది. ఇంత చిన్న వయసులోనే అలాంటి నరకాన్ని, దారుణమైన పరిస్థితులను అనుభవించిన ఏ అమ్మాయికైనా తన శరీరం మీద వ్యామోహం, గౌరవం పోతాయని తెలిపింది. అందుకే తనలో శారీరక కోరికలు, ఆకర్షణలు పూర్తిగా చచ్చిపోయాయని చెప్పుకొచ్చింది.


శ్రద్ధా శ్రీనాథ్

# జనాలకు గుర్తు చేయాలి

టాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్‌లలో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రద్ధా శ్రీనాథ్. గత ఏడాది 'ఆర్యన్' చిత్రంతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం 'బ్రో కోడ్' మూవీతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ప్రస్తుత జనరేషన్‌లో నటీనటులపై ఉన్న ఒత్తిడి గురించి శ్రద్ధా ఓపెన్‌గా మాట్లాడారు. "ఈ రోజుల్లో కేవలం నటిగా ఉంటే సరిపోదు. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ, మనం బతికే ఉన్నామని జనాలకి గుర్తు చేస్తూనే ఉండాలి. సినిమాల క్వాలిటీ కంటే ఆన్‌లైన్ విజిబిలిటీకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. నాకైతే నా పర్సనల్ లైఫ్‌ను నిరంతరం ఆన్‌లైన్‌లో షేర్ చేయడం అస్సలు నచ్చదు. కానీ అలా చేయకపోతే వెనకబడిపోతామనే భయం వేస్తుంది. ఒక ఫ్రెండ్ సలహా మేరకు ఇప్పుడు దీన్ని ఒక గేమ్ లాగా భావించి ఫాలో అవుతున్నాను" అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పుకొచ్చారు.

# పెళ్లి కంటే కుక్క బెటర్: కలర్ స్వాతి



తెలుగులో సూపర్ హిట్ చిత్రాలతో మెప్పించిన కలర్ స్వాతి కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే వివాహం చేసుకున్న స్వాతి.. ఆ తర్వాత భర్తతో వచ్చిన మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకుని విడిపోయారు. అప్పటి నుండి నిత్యం తన పర్సనల్ లైఫ్ విషయాలపై ఓపెన్‌గా స్పందిస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా పెళ్లి, బంధాలపై ఆమె చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట సంచలనంగా మారాయి. ఓ ఇంటర్వ్యూలో స్వాతి మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో రిలేషన్‌షిప్స్ ఎలా మారిపోయాయో వివరించారు. "ఈ రోజుల్లో ఒక మనిషిని పూర్తిగా నమ్మి, పెళ్లి చేసుకుని, జీవితాంతం కలిసి ఉండటం అనేది చాలా కష్టమైన విషయంగా మారిపోయింది. భాగస్వాముల మధ్య ఒకరినొకరు అర్థం చేసుకునే ఓపిక ఎవరికీ ఉండటం లేదు. అందుకే, ఎవరినో ఒకరిని పెళ్లి చేసుకుని, ప్రతిరోజూ గొడవలతో మానసిక ప్రశాంతతను పూర్తిగా కోల్పోవడం కన్నా.. హాయిగా ఒక కుక్కను పెంచుకోవడం చాలా బెటర్" అని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు.

# బ్రేక్ తీసుకుంటున్నా: అడివి శేష్



టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఇటీవల 'డెకాయిట్' చిత్రంతో సక్సెస్ సాధించిన ఆయన త్వరలో 'గూఢచారి-2' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే షూటింగ్ కూడా ప్రారంభం కాగా.. పలు పోస్టర్లు విడుదలై అంచనాలను మరింత పెంచాయి. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అడివి శేష్ తాను బ్రేక్ తీసుబోతున్నట్లు వెల్లడించారు. 'గత ఏడాది కాలంగా అస్సలు ప్రశాంతత లేదు. షూటింగ్ షెడ్యూల్స్ చాలా కఠినంగా సాగాయి. 'డెకాయిట్' సక్సెస్‌ను పూర్తిగా ఎంజాయ్ చేసే టైమ్ కూడా దొరకలేదు. అందుకే ఈ బ్రేక్ తీసుకుని నా ఫ్యామిలీతో క్వాలిటీ టైమ్ గడపాలనుకుంటున్నాను' అని తెలిపాడు.

# టీ20ల్లో 200 కొడతా

## : వైభవ్ సూర్యవంశీ

వైభవ్ సూర్యవంశీ భారీ స్టేట్మెంట్ ఇచ్చేశాడు. టీ20ల్లో వ్యక్తిగతంగా 200 పరుగులు సాధించాలనుకుంటున్నట్లు చెప్పాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను ఈ విషయాన్ని చెప్పాడు. ఐపీఎల్ 2026లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న వైభవ్.. అసాధారణ లక్ష్యాన్ని



నిర్దేశించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో దాదాపు ప్రతి బౌలర్‌ను వైభవ్ చితకబాదాడు. ఇక టీ20 క్రికెట్ ఫార్మాట్‌లో డబుల్ సెంచరీ కొట్టిన తొలి బ్యాటర్ కావాలనుకుంటున్నట్లు చెప్పాడు. టీ20 క్రికెట్‌లో ఇప్పటి వరకు విండీస్ బ్యాటర్ క్రిస్ గేల్ అత్యధికంగా 175 రన్స్ చేశాడు. ఆర్సీబీ జట్టు తరపున అతను ఆ స్కోర్ చేశాడు. 2013 ఐపీఎల్ సీజన్‌లో పూణె జట్టుపై ఆ వ్యక్తిగత హయ్యెస్ట్ స్కోర్ చేశాడు. ఇప్పుడు ఆ రికార్డును సూర్యవంశీ బద్దలు చేయాలనుకుంటున్నాడు. చరిత్రాత్మక ఇన్నింగ్స్‌ను టార్గెట్ పెట్టుకున్నట్లు తెలిపాడు. యూట్యూబ్ షో ద స్విచ్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ.. టీ20 క్రికెట్ మ్యాచ్‌లో 200 రన్స్ స్కోర్ చేయాలని ఉందని సూర్యవంశీ తెలిపాడు. గేల్ ఖాతాలో 175 రన్స్ ఉన్నాయని, ఆ మైలురాయిని దాటాలని ఉందా అని అడ్డగా, అవును ఆ రికార్డును బ్రేక్ చేయాలని ఉందన్నాడు. టీ20 మ్యాచ్‌లో 200 రన్స్ స్కోరు చేయనున్నట్లు తెలిపాడు.ఏదైనా మ్యాచ్‌లో 20 ఓవర్లు ఆడగలిగితే, అప్పుడు కచ్చితంగా ఆ రికార్డును బద్దలు కొడుతానన్నాడు.

## శ్రీలంక వైట్‌బాల్ కెప్టెన్‌గా కుశాల్ మెండిస్



శ్రీలంక వైట్ బాల్ కెప్టెన్‌గా కుశాల్ మెండిస్ ఎంపికయ్యాడు. వెస్టిండీస్ పర్యటనలో వన్డే, టీ20 సారథిగా మెండిస్ వ్యవహరించనున్నాడు. కరీబియన్ గడ్డపై మూడు ఫార్మాట్ల సిరీస్‌కు సోమవారం శ్రీలంక సెలెక్టర్లు స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. టెస్టు జట్టును ధనంజయ డిసిల్వా నడిపించనున్నాడు. గాయం నుంచి కోలుకున్న ఆల్‌రౌండర్ వనిందు హసరంగ వన్డే, టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున రాణిస్తున్న ఇషాన్ మలింగను సైతం వైట్ బాల్ ఫార్మాట్‌కు సెలెక్టర్లు ఎంపిక చేశారు. వెస్టిండీస్ పర్యటనలో శ్రీలంక మూడు వన్డేలు.. మూడు టీ20లు.. రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. జూన్ 3 నుంచి 8 వరకు వన్డేల్లో, ఆపై 12 నంచి 15 వరకూ లంక, విండీస్ జట్లు తలపడుతాయి. జూన్ 25 నుంచి టెస్టు సిరీస్ మొదలవ్వనుంది. అందుకని సెలెక్టర్లు పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. మే 26న వెస్టిండీస్‌కు శ్రీలంక బృందం వెళ్లనుంది.




# టైటిల్ ఫైట్ నేటి నుంచే!

## నేడు ఐపీఎల్ క్వాలిఫయర్ 1.. బరిలో బెంగళూరు, గుజరాత్

ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ ముగియడంతో అసలైన సమరం ప్రారంభమైంది. ఈ ఏడాది అత్యంత స్థిరమైన ప్రదర్శన కనబరిచిన నాలుగు జట్లు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. బ్యాటింగ్ దూకుడు, బౌలింగ్ బలం, కెప్టెన్సీ వ్యూహాలు, యువ ఆటగాళ్ల ప్రభావం ఈ సీజన్‌ను మరింత ఆసక్తికరంగా మార్చాయి. ఇప్పుడు టైటిల్ కోసం జరిగే పోరు అభిమానుల్లో భారీ ఉత్కంఠ రేపుతోంది.

### ఆర్సీబీ.. సమతుల్య జట్టుగా మారిన బెంగళూరు

ఈసారి కేవలం స్టార్ ఆటగాళ్లపై ఆధారపడకుండా సమిష్టి ఆటతో ముందుకు వచ్చింది. టాప్ ఆర్డర్‌లో స్థిరమైన బ్యాటింగ్, మధ్య ఓవర్లలో వేగంగా పరుగులు సాధించే సామర్థ్యం జట్టుకు ప్రధాన బలం. బౌలింగ్ విభాగంలో డెత్ ఓవర్ల నియంత్రణ గత సీజన్లతో పోలిస్తే మెరుగుపడింది. అయితే కీలక మ్యాచ్‌లలో ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటారన్నది ఆర్సీబీకి పెద్ద పరీక్షగా మారనుంది.

### గుజరాత్ టైటాన్స్.. వ్యూహాత్మక ఆటలో ముందంజ

మరోసారి సమతుల్య ప్రదర్శనతో ప్లేఆఫ్స్‌కు చేరింది. పరిస్థితులకు అనుగుణంగా మ్యాచ్‌ను మలచగల సామర్థ్యం ఈ జట్టును ప్రత్యేకంగా నిలబెట్టింది. బలమైన పేస్ దాడితో పాటు స్పిన్ విభాగం కూడా సమర్థంగా పనిచేస్తోంది. మధ్య ఓవర్లలో వికెట్లు తీసే నైపుణ్యం గుజరాత్‌కు కీలక బలం. అయితే కొన్ని మ్యాచ్‌లలో టాప్ ఆర్డర్‌పై అధిక ఆధారపడటం బలహీనతగా కనిపించింది.

### సన్‌రైజర్స్ హైదరాబాద్.. పేలవ బ్యాటింగ్ నుంచి పేలుడు ఆట వరకు

ఈ సీజన్‌లో అత్యంత దూకుడైన బ్యాటింగ్ జట్లలో ఒకటిగా నిలిచిన జట్టు హైదరాబాద్. పవర్‌ప్లే నుంచే భారీ షాట్లతో ప్రత్యర్థులపై ఒత్తిడి పెంచడం ఈ జట్టు ప్రత్యేకత. యువ ఆటగాళ్లు, విదేశీ స్టార్‌ల కలయిక బ్యాటింగ్ లైనప్‌ను మరింత బలంగా మార్చింది. అయితే బౌలింగ్ విభాగంలో కొన్నిసార్లు అధిక పరుగులు ఇవ్వడం ఆందోళన కలిగిస్తోంది. కీలక సమయంలో బౌలర్లు మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### రాజస్థాన్ రాయల్స్.. యువత, అనుభవం కలయిక

రాజస్థాన్ మరోసారి సమతుల్య జట్టుగా నిలిచింది. ఓపెనర్లు వేగంగా ఆరంభం ఇవ్వడం, మధ్య వరుసలో స్థిరత్వం జట్టుకు బలం. స్పిన్ బౌలింగ్ విభాగం మ్యాచ్‌లను మలుపుతిప్పగల సామర్థ్యాన్ని చూపించింది. యువ ఆటగాళ్లు ఒత్తిడిలోనూ ధైర్యంగా ఆడటం రాజస్థాన్‌కు అదనపు బలం. అయితే ఫినిషింగ్‌లో స్థిరత్వం కొన్నిసార్లు లోపించింది.



## పద్మశ్రీ అందుకున్న హర్మన్‌ప్రీత్

భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన "పద్మశ్రీ" అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. భారత క్రికెట్‌లో అత్యంత ప్రభావవంతమైన ప్లేయర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన హర్మన్, గత 17 ఏళ్లుగా జాతీయ జట్టుకు సేవలందిస్తూ అనేక చారిత్రక విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా 2025లో జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టును విజేతగా నిలిపిన కెప్టెన్‌గా ఆమె పేరు చరిత్రలో నిలిచిపోయింది. ఈ విజయంతో భారత మహిళల క్రికెట్‌కు కొత్త గుర్తింపు వచ్చింది. కాగా, ఈ ఏడాది ప్రారంభంలో హర్మన్‌తో పాటు భారత పురుషుల జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ పురస్కారం ప్రకటించారు. ప్రపంచకప్ విజయాలు సాధించిన ఇద్దరు కెప్టెన్లు ఒకే ఏడాది ఈ గౌరవాన్ని పొందడం భారత క్రికెట్‌కు అరుదైన ఘట్టంగా భావించబడుతోంది. క్రికెట్‌కు సంబంధించి గతంలో సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోని, కపిల్ దేవ్, రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి దిగ్గజాలు పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

## బసవారెడ్డి.. ఏడో సీడ్‌కు షాక్



టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో భారత సంతతి కుర్రాడు నిశేష్ బసవారెడ్డి పేరు మార్మోగిపోయింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో వైల్డ్ కార్డ్‌తో అడుగుపెట్టిన నిశేష్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఏడోసీడ్ టేలర్ ఫ్రిట్జ్(అమెరికా)ను మట్టికరిపించాడు. 148వ ర్యాంకరైన ఈ భారతీయ అమెరికన్ ధాటికి తొలి రౌండ్‌లో ఫ్రిట్జ్ చేతులెత్తేశాడు. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా ఓపెన్‌లో జకోవిచ్‌కు చెమటలు పట్టించిన నిశేష్ ఈసారి మట్టికోర్టులో గెలుపు గర్జన చేశాడు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో డేటా సైన్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్ చదివిన నిశేష్ బసవారెడ్డి టెన్నిస్‌లోనూ రాణిస్తున్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఆకట్టుకున్న ఈ కుర్రాడు రొలాండ్ గరోస్‌లో తొలి విజయంతో వారెవ్వా అనిపించాడు. తనకంటే మెరుగైన ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్‌పై అద్భుత విజయంతో రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. తొలి సెట్‌ను 6-7తో కోల్పోయినా ఒత్తిడికి లోనవ్వని వినేశ్.. రెండో సెట్‌ను 7-5తో గెలుచుకున్నాడు. అదే ఊపులో ప్రత్యర్థికి ఏ అవకాశమివ్వకుండా మూడో సెట్‌ను కైవసం చేసుకొని ఫ్రిట్జ్‌ను ఇంటికి పంపాడు. మ్యాచ్ అనంతరం కోర్టులో మాట్లాడుతూ ఇది కచ్చితంగా నా కెరీర్లో అతిపెద్ద విజయం. అందరికీ ధన్యవాదాలు. మీ అందరి ముందు ఆడడం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. ఈరోజు నాకు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు. మొదటిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో మెయిన్ డ్రా ఆడుతున్నా. మీ అందరి మద్దతు మళ్లీ లభిస్తుందని ఆశిస్తున్నా అని 21 ఏళ్ల నిశేష్ పేర్కొన్నాడు.

## ఐపీఎల్‌కు మురుగన్ అశ్విన్ గుడ్‌బై

తమిళనాడు చెందిన మరో క్రికెటర్ ఐపీఎల్ సహా దేశవాలీ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. కొద్ది రోజుల కిందట ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ దేశవాలీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కు వీడ్కోలు పలకగా.. తాజాగా మురుగన్ అశ్విన్ కూడా రెండు విభాగాలకు బై బై చెప్పాడు. 35 ఏళ్ల అశ్విన్ లెగ్ బ్రేక్ బౌలర్‌గా సుపరిచితుడు. 2016లో రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసిన మురుగన్.. 2018లో ఆర్సీబీకి, 2019-21 వరకు పంజాబ్ కింగ్స్‌కు, 2022లో ముంబై ఇండియన్స్‌కు, 2023లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడాడు. అప్పటి నుంచి అతన్ని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. దీంతో అతను ఐపీఎల్ నుంచి తప్పుకున్నాడు. మురుగన్ తన ఐపీఎల్ కెరీర్‌లో 44 మ్యాచ్‌లు ఆడి 35 వికెట్లు తీశాడు. 2012లో తమిళనాడు తరఫున దేశవాలీ అరంగేట్రం చేసిన మురుగన్.. 2023, 24లో చండీఘడ్‌కు, 2025లో జమ్మూ కశ్మీర్‌కు ఆడాడు. దేశవాలీ కెరీర్‌లో 7 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు, 29 లిస్ట్-ఏ, 105 టీ20లు ఆడిన మురుగన్.. మొత్తంగా 130 వికెట్లు తీశాడు.





## త్వరలో హార్దిక్ రెండో పెళ్లి!

భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యాతో వివాహం జరగబోతోందనే వార్తల నడుమ, సూపర్ మోడల్ మహీకా శర్మ అతని కుమారుడు అగస్త్యపై తనకున్న ప్రేమ, వాత్సల్యాన్ని చాటుకుంటున్నారు. హార్దిక్ పాండ్యా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తాజా ఫొటోలో మహీకా శర్మ, అగస్త్యతో కలిసి కనిపించారు. భారతదేశపు టాప్ సూపర్ మోడల్స్‌లో ఒకరైన మహీకా శర్మ, గత ఏడాది కాలంగా హార్దిక్ పాండ్యాతో రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. గత కొన్ని నెలలుగా ఆమె పాండ్యా కుమారుడైన అగస్త్యతో కలిసి పలు సందర్భాల్లో కనిపించారు. మహీకా, హార్దిక్‌లు ఇద్దరూ ఈ బంధాన్ని ఎంతో సీరియస్ తీసుకున్నప్పటికీ, పెళ్లి గురించి మాత్రం మీడియా ముందు ఇప్పటివరకు స్పందించలేదు. తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను గోప్యంగా ఉంచుతున్నప్పటికీ, ఈ జంట తరచూ వార్తల్లో నిలుస్తోంది. విహారయాత్రల నుండి పూజల వరకు, ఇద్దరూ కలిసి తమ వ్యక్తిగత సమయాన్ని ఎంతో సంతోషంగా గడుపుతున్నారు.



## హైదరాబాద్ డేంజర్: అక్షర్ పటేల్

ఐపీఎల్ 2026లో లీగ్ దశ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇక రేపటి నుంచి ప్లే ఆఫ్స్ షురూ అవుతాయి. ఇలాంటి క్రమంలో ఎలిమినేట్ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సారి ప్లే ఆఫ్స్ కు చేరుకున్న జట్లలో సన్ రైజర్స్ హైదరాబాద్ అత్యంత ప్రమాదకరంగా ఉందని వార్నింగ్ ఇచ్చారు. సన్ రైజర్స్ హైదరాబాద్ లో టాప్ 3 బ్యాటర్లు అభిషేక్, హెడ్, ఇషాన్ రాణిస్తే.. ఆ జట్టును ఆపడం ఎవరి తరం కాదని డేంజర్ బెల్స్ పంపించారు. అదే ఆ ముగ్గురు ఔట్ అయితే.. పరిస్థితి చక్కదిద్దేందుకు క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి మిడిల్ ఆర్డర్ లో అత్యంత ప్రమాదకరంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఇప్పటికే ఈ కాంబో చాలా మ్యాచ్ లను గెలిపించిందని కూడా గుర్తు చేశారు. కమిన్స్ ఇలాంటి అంతర్జాతీయ ప్లేయర్ కెప్టెన్ గా ఉండడం హైదరాబాద్ కు మరింత అడ్వాంటేజ్ అన్నారు. దీంతో అక్షర్ పటేల్ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి.



ఈవార్తలు
ప్రజావాణి
మంగళవారం 26-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# మోదీ పుష్కర పాలన.. అరుదైన ఘట్టం

భారత ప్రజాస్వామ్య చరిత్రలో మే 26వ తేదీకి ఒక ప్రత్యేక స్థానం దక్కబోతోంది. నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి సరిగ్గా పుష్కరకాలం (12 ఏళ్లు) పూర్తి చేసుకుంటున్న రోజిది. 140 కోట్లకు పైగా జనాభా, ఎన్నో భిన్నత్వాలు, సంక్లిష్టమైన రాజకీయాలు ఉన్న మనలాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఒక నాయకుడు పన్నెండేళ్ల పాటు నిరవధికంగా ప్రధాని పీఠంపై నిలదొక్కుకోవడం నిస్సందేహంగా ఒక చారిత్రక ఘట్టం. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో జవహర్‌లాల్ నెహ్రూ, ఆ తర్వాత ఇందిరా గాంధీ వంటి ఉద్దండులు సుదీర్ఘకాలం పాటు ప్రధానులుగా దేశాన్ని పాలించారు. అయితే, అప్పటి రాజకీయ పరిస్థితులకు, ప్రస్తుత కాలానికి ఎంతో వ్యత్యాసం ఉంది. ఓటరు చైతన్యం పెరిగిన ఈ డిజిటల్ యుగంలో, ప్రతి ప్రభుత్వ నిర్ణయం తక్షణం ప్రజాక్షేత్రంలో విశ్లేషణకు గురవుతున్న తరుణంలో, వరుసగా మూడు సార్లు ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం సామాన్యమైన వ్యవహారం కాదు. ఇది కేవలం ఒక వ్యక్తి లేదా పార్టీ విజయంగా కంటే, భారతీయ ఓటరు పరిణతికి, మన ప్రజాస్వామ్య వ్యవస్థ దృఢత్వానికి ప్రతీకగా చూడాలి. ఒక సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి పన్నెండేళ్ల పాటు నాయకత్వం వహించడం మన రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశం. 2014లో 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' నినాదంతో అధికారంలోకి వచ్చిన మోదీ.. గడిచిన పన్నెండేళ్లలో దేశాన్ని ఎన్నో మార్పుల వైపు నడిపించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలపడంలో ఈ పుష్కరకాల పాలన అడుగులు వేసింది. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల నిర్మాణంతో మౌలిక సదుపాయాల కల్పనలో మునుపెన్నడూ లేని వేగం కనిపించింది. 'డిజిటల్ ఇండియా' ద్వారా సామాన్యుల ముంగిటకు సాంకేతికతను తీసుకురావడం ఒక గొప్ప విజయం. సంక్షేమ పథకాలను దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారులకు నేరుగా చేర్చడంలో సాంకేతికతను వాడుకున్న తీరు పాలనలో జవాబుదారీతనాన్ని పెంచింది. అంతర్జాతీయ వేదికలపై భారత దేశ స్వరాన్ని బలంగా వినిపించడం, సంక్లిష్టమైన భౌగోళిక రాజకీయాల మధ్య స్వతంత్ర విదేశీ విధానాన్ని అనుసరించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయడం ఈ పన్నెండేళ్లలో ప్రముఖంగా కనిపిస్తాయి. ఎంత గొప్ప పాలనలోనైనా లోపాలు, సవాళ్లు సహజం. సంపాదకీయ కోణంలో చూసినప్పుడు విజయాలను కీర్తించినట్లే, లోపాలను కూడా బేరీజు వేసుకోవాలి. నిరుద్యోగం, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, ద్రవ్యోల్బణం వంటివి సామాన్యులను ఇంకా పీడిస్తున్న సమస్యలే. సంపద సృష్టి జరుగుతున్నా, అది అట్టడుగు స్థాయికి చేరడంలో ఇంకా వేగం పెరగాల్సిన అవసరం ఉంది. సమాజంలో ధ్రువీకరణ పెరుగుతోందన్న విమర్శలు, సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటోందని రాష్ట్రాల నుంచి వస్తున్న ఆరోపణలు, రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు ప్రభుత్వానికి ప్రధాన సవాళ్లుగా నిలిచాయి. ఏది ఏమైనప్పటికీ, పుష్కరకాలం పాటు అప్రతిహతంగా దేశాన్ని పాలించడం నరేంద్ర మోదీకి ప్రజలు ఇచ్చిన అపూర్వమైన తీర్పు. ఈ పన్నెండేళ్ల కాలం మోదీ వ్యక్తిగత రికార్డుగానే కాకుండా, నవభారత నిర్మాణానికి ఒక బలమైన పునాదిగా మిగిలిపోవాలి. దేశ భద్రత, ప్రగతి పరంగా సాధించిన విజయాలను సుస్థిరం చేసుకుంటూనే.. నిరుద్యోగం, సామాజిక ఐక్యత వంటి సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ పౌరులందరి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా భవిష్యత్తు పాలన సాగాలి. ప్రజాస్వామ్యంలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కంటే గొప్ప పురస్కారం మరొకటి ఉండదు.



# సంగీతంతో ఆధ్యాత్మిక సుగంధాలు

భారతీయ సనాతన ధర్మంలో ఎందరో మహానుభావులు, యోగులు ఆధ్యాత్మికతను పరిమళింపజేశారు. అలాంటి వారిలో తనదైన విశిష్టతను చాటుకుంటూ, భక్తికి, సంగీతానికి, సేవకు వారధిగా నిలిచిన దివ్యమూర్తి.. అవధూత దత్త పీఠం వ్యవస్థాపకులు పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ. కేవలం ఆధ్యాత్మిక బోధనలకే పరిమితం కాకుండా, 'నాదోపాసన' ద్వారా మానసిక ప్రశాంతతను అందించడంలో వారు చేసిన కృషి అజరామరం.నాద బ్రహ్మ.. సంగీత చికిత్సకుడుస్వామీజీ కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు, ఒక అద్భుతమైన సంగీత విద్వాంసులు. వారు అందించే 'మ్యూజిక్ ఫర్ మెడిటేషన్ అండ్ హీలింగ్' (సంగీత చికిత్స) ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి మానసిక ఒత్తిడిని, అనారోగ్యాలను దూరం చేసింది. రాగాలు, స్వరాలు ప్రకృతిని, మానవ శరీరాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో నిరూపించి, సంగీతాన్ని ఒక దివ్య ఔషధంగా మార్చారు. వారి వేణుగానం మరియు కీర్తనలు భక్తులకు అపారమైన అనుభూతిని కలిగిస్తాయి.సేవయే దైవత్వం"సాధువు తన కోసం జీవించడు, సమాజం బాగు కోసం జీవిస్తాడు" అన్న నానుడిని స్వామీజీ జీవితం అక్షరాలా నిజం చేస్తోంది. వారి ఆశ్రమం ద్వారా నిర్వహిస్తున్న సామాజిక, సాంస్కృతిక మరియు సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం. ఉచిత అన్నదానం, వేద పాఠశాలలు, గో సంరక్షణ, మరియు పర్యావరణ పరిరక్షణ కోసం వారు చేస్తున్న కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం.దత్త తత్వ ప్రచారందత్తాత్రేయ సంప్రదాయాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో స్వామీజీ పాత్ర మరువలేనిది. మైసూర్‌లోని అవధూత దత్త పీఠం విశ్వవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తులకు ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరికీ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచుతూ, శాంతి, సామరస్యాలను బోధిస్తున్నారు.నేటి యాంత్రిక జీవనంలో, మానసిక అశాంతితో సతమతమవుతున్న ఆధునిక సమాజానికి గణపతి సచ్చిదానంద స్వామి వారి బోధనలు, సంగీతం ఒక దిక్సూచిలా పనిచేస్తున్నాయి. వారి దివ్య ఆశీస్సులు, మార్గదర్శకత్వం భవిష్యత్తులోనూ మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



రామ్ మనోహర్ శర్మ బండపెల్లి
ఆధ్యాత్మిక పండితుడు
8106194150

**ఒకప్పుడు ఊరి చివర తిరిగే రెండు, మూడు కుక్కలు ఇప్పుడు నగరాలు, కాలనీలు, స్కూళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లను ఆక్రమించిన దృశ్యం కనిపిస్తోంది. రాత్రివేళ వీధుల్లో గుంపులుగా తిరిగే కుక్కలు... ఉదయం స్కూల్‌కు వెళ్తున్న చిన్నారులపై దాడులు... వృద్ధులపై మొరుగులు... బైక్‌ల వెంట పరిగెత్తే గుంపులు.. ఇవన్నీ ఇప్పుడు దేశవ్యాప్తంగా సాధారణ దృశ్యాలుగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు చేసిన ఒక కీలక వ్యాఖ్య దేశ దృష్టిని మరోసారి ఈ సమస్యపై కేంద్రీకరించింది. "వీధి కుక్కల సమస్యను కేవలం జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణ భద్రత అంశంగా పరిగణించాలి" అని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం దేశ పరిపాలనా వ్యవస్థకు గట్టి హెచ్చరికగా మారింది.**



# ప్రజల భద్రతకే 'సుప్రీం' పెద్దపీట

భారతదేశంలో వీధి కుక్కల ఖచ్చితమైన సంఖ్యపై వివిధ అంచనాలు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పశుసంవర్ధక శాఖలు, జంతు సంక్షేమ సంస్థల అంచనాల ప్రకారం దేశంలో ప్రస్తుతం సుమారు 6 కోట్లకు పైగా వీధి కుక్కలు ఉన్నట్లు భావిస్తున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఈ సంఖ్య 7 కోట్లకు చేరిందని చెబుతున్నాయి. ఒక్కో పెద్ద నగరంలోనే లక్షల్లో కుక్కలు సంచరిస్తున్నాయి. ఢిల్లీలో 8 నుండి 10 లక్షల మధ్య, ముంబైలో సుమారు 3 లక్షలు, హైదరాబాద్‌లో 5 లక్షలకు పైగా, బెంగళూరులో 4 లక్షల వరకు, చెన్నైలో 2 లక్షలకు పైగా వీధి కుక్కలు ఉన్నట్లు అంచనాలు చెబుతున్నాయి. ఇవి అధికారిక లెక్కలు కాకపోయినా పరిస్థితి తీవ్రతను ప్రతిబింబించే గణాంకాలుగా నిలుస్తున్నాయి. జాతీయ ఆరోగ్య సంస్థల అంచనాల ప్రకారం భారతదేశంలో ప్రతి ఏడాది 1.5 కోట్లకు పైగా కుక్క కాట్ల కేసులు నమోదవుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక రేబిస్ మరణాలు నమోదయ్యే దేశాల్లో భారత్ ఒకటి. ప్రతి సంవత్సరం సుమారు 18 వేల నుండి 20 వేల మంది వరకు రేబిస్‌తో మరణిస్తున్నారని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు అంచనా వేస్తున్నాయి. వీరిలో అధిక శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. చిన్నారులే ఎక్కువగా బలి అవుతున్నారు. ఒక కుక్క కాటు ఒక కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా ఛిన్నాభిన్నం చేస్తోంది. దేశంలో చాలా మంది అనుకునే ఒక పెద్ద అపోహ.. "ప్రభుత్వాలు కుక్కలను పట్టుకొని చంపేస్తున్నాయి" అన్నది. వాస్తవానికి భారతదేశంలో వీధి కుక్కలను సామూహికంగా చంపడం చట్టవిరుద్ధం. 2001లో రూపొందించిన "జంతువుల జనన నియంత్రణ (కుక్కలు) నియమాలు" మరియు తరువాతి సవరణల ప్రకారం వీధి కుక్కలను చంపడం నిషేధం. రేబిస్ సోకినవి లేదా తీవ్ర ప్రమాదకరంగా మారిన కుక్కల విషయంలో మాత్రమే ప్రత్యేక చర్యలు తీసుకోవచ్చు. పట్టుకున్న కుక్కలకు స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స), వ్యాక్సినేషన్ చేసి మళ్లీ అదే ప్రాంతంలో వదలాలి. అంటే ప్రభుత్వం అధికారికంగా "నిర్మూలన" విధానాన్ని కాదు, "నియంత్రణ" విధానాన్నే అమలు చేస్తోంది.

సుప్రీంకోర్టు ప్రత్యేకంగా ప్రస్తావించిన అంశం జంతువుల జనన నియంత్రణ కేంద్రాలు. ఈ కేంద్రాల్లో కుక్కలకు స్టెరిలైజేషన్ శస్త్రచికిత్సలు చేస్తారు. రేబిస్ వ్యాక్సిన్ ఇస్తారు. కొన్ని రోజుల తర్వాత తిరిగి అదే ప్రాంతంలో వదిలేస్తారు. సిద్ధాంతపరంగా ఇది శాస్త్రీయ పద్ధతి. కానీ అమలులో మాత్రం భారీ లోపాలు కనిపిస్తున్నాయి. దేశంలోని చాలా జిల్లాల్లో పూర్తి స్థాయి జంతువుల జనన నియంత్రణ కేంద్రాలే లేవు. ఉన్న కేంద్రాల్లో నిధుల కొరత, శిక్షణ పొందిన వెటర్నరీ సిబ్బంది కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ఒక నగరంలో లక్షల కుక్కలు ఉండగా, సంవత్సరానికి కొన్ని వేలకే శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అయితే దాదాపు కార్యక్రమాలే లేవు. ఉదాహరణకు, ఒక నగరంలో 5 లక్షల కుక్కలు ఉంటే జనాభా నియంత్రణ ప్రభావం చూపాలంటే కనీసం 70 శాతం కుక్కలకు స్టెరిలైజేషన్ జరగాలి. కానీ చాలా నగరాల్లో అది 20 నుంచి 30 శాతం దాటడం లేదు. దీంతో ప్రతి సంవత్సరం కొత్త కుక్కల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. సమాజంలో ఎక్కువ మంది కోపం కుక్కలపై చూపిస్తున్నారు. కానీ అసలు కారణాలు మన వ్యవస్థల వైఫల్యాలే. బహిరంగ చెత్త కుప్పలు కుక్కలకు ఆహార కేంద్రాలుగా మారాయి. చికెన్ షాపులు, హోటళ్ల వ్యర్థాలను వీధుల్లో పడేయడం వల్ల కుక్కల గుంపులు పెరుగుతున్నాయి. ఫ్యాషన్‌గా పెంచిన పెంపుడు కుక్కలను తర్వాత వీధుల్లో వదిలేయడం మరో ప్రధాన కారణంగా మారింది. స్థానిక సంస్థలు సమస్య తీవ్రమయ్యే వరకు చర్యలు తీసుకోకపోవడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోంది.

జంతువులకు ఆహారం పెట్టడం మానవత్వమే. కానీ అదే సమయంలో ప్రజల భద్రతను విస్మరించడం ప్రమాదకరం. కొన్ని ప్రాంతాల్లో కుక్కలకు ఆహారం పెట్టే కేంద్రాల చుట్టూ గుంపులు ఏర్పడుతున్నాయి. రాత్రిళ్లు దాడులు పెరుగుతున్నాయి. స్థానికులు భయంతో జీవిస్తున్నారు. ఇక్కడ అసలు ప్రశ్న – "ఒక కుక్కకు ఆహారం పెట్టే హక్కు ఎంత ముఖ్యమో.. ఒక చిన్నారి భయంలేకుండా స్కూల్‌కు వెళ్లే హక్కు అంతకంటే తక్కువా?" సుప్రీంకోర్టు ఇప్పుడు ఇదే ప్రశ్నను దేశం ముందుంచింది. కోర్టు చెప్పింది కుక్కలను చంపేయమని కాదు. అలాగే ప్రజలు చనిపోతున్నా చూడమని కూడా కాదు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, శాస్త్రీయ నియంత్రణ పద్ధతులు అమలు చేయాలని, రేబిస్ వ్యాక్సినేషన్ పెంచాలని, ప్రమాదకర కుక్కలపై చట్టబద్ధ చర్యలు తీసుకోవాలని, స్కూళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద ప్రత్యేక భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇది భావోద్వేగాలకు అతీతంగా ఇచ్చిన పరిపక్వ సందేశం.

ఇప్పుడు దేశం రెండు మార్గాల మధ్య నిలిచింది. ఒకటి భావోద్వేగ రాజకీయాలు. మరొకటి శాస్త్రీయ ప్రజా భద్రత. వీధి కుక్కల సమస్యను ఇప్పటికైనా సమగ్రంగా పరిష్కరించకపోతే రేబిస్ మరణాలు పెరుగుతాయి. పిల్లల భద్రత ప్రశ్నార్థకమవుతుంది. నగర జీవనం భయానకంగా మారుతుంది. ప్రజల్లో ప్రభుత్వాలపై ఆగ్రహం పెరుగుతుంది. కానీ శాస్త్రీయ నియంత్రణ, చెత్త నిర్వహణ, వ్యాక్సినేషన్, కఠిన పర్యవేక్షణ అమలు చేస్తే సమస్యను కొన్నేళ్లలోనే నియంత్రించే అవకాశం ఉంది. ఒక సమాజం జంతువులను ఎలా చూస్తుందో దాని నాగరికతను తెలియజేస్తుంది. అలాగే ఒక సమాజం తన పిల్లలను ఎంత భద్రంగా కాపాడుతుందో దాని బాధ్యతను తెలియజేస్తుంది. మానవత్వం అంటే కేవలం కుక్కలకు ఆహారం పెట్టడం కాదు. ఒక చిన్నారి భయంలేకుండా స్కూల్‌కు వెళ్లే పరిస్థితి కల్పించడం కూడా మానవత్వమే. ఇప్పుడు దేశం ఎదురు చూస్తున్నది ఒక్కటే... సుప్రీంకోర్టు మాటలు ఫైళ్లలోనే మిగిలిపోతాయా? లేక వీధుల్లో నిజమైన మార్పు కనిపిస్తుందా? వేచి చూడాల్సిందే!



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.